PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 356 | విజయవాడ, ఆదివారం 28 జులై 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 28 July 2024 | Rs

ఎమ్మెల్యే బంధువుల బరితెగింపు

- రూ.1188 కోట్ల విలువైన భూమిపై కన్ను
- జెసిబితో హెచ్చరిక బోర్డులు తొలగింపు
- అడ్డుకున్న దేవాదాయశాఖ ఉద్యోగులు

3



షూటింగ్‌లో తొలి స్వర్ణం సాధించిన చైనా బృందం హువాంగ్ యుటింగ్, షెంగ్ లియావో

పది మంది సిఎంలు దూరం

- ప్రహసనంగా నీతి ఆయోగ్ భేటీ
- ఏడుగురు ముఖ్యమంత్రుల బాయ్‌కాట్
- మమత వాకౌట్
- ఎన్‌డియేకు చెందిన ఇద్దరు సిఎంలు డుమ్మా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఏడుగురు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు శనివారం నీతి ఆయోగ్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో తనను అవమానించారంటూ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వాకౌట్ చేశారు. మరో ఇద్దరు ఎన్‌డిఎ భాగస్వామ్య ముఖ్యమంత్రులు సమావేశానికి డుమ్మా చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

దీంతో నీతి ఆయోగ్ సమావేశం ప్రహసనంగా తయారైంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, కేరళ ముఖ్య మంత్రి పినరయి విజయన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి (తెలంగాణ), సిద్ద రామయ్య (కర్ణాటక), సుఖ్వీందర్ సింగ్ సుఖ్ (హిమాచల్‌ప్రదేశ్) నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకాలేమని ప్రకటించారు. ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ తీహార్ జైల్‌లో ఉండటం వల్ల ఆయన కూడా హాజరుకాలేరు. ఈ సమావేశంలో ఎపి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పాల్గొని మాట్లాడారు. నీతి ఆయోగ్ సభ్యులుగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు ఎక్స్-అఫీషియో సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్, సభ్యులు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోడి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 20 రాష్ట్రాల ముఖ్య మంత్రులు, 6 కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్ట్‌నెంట్ గవర్నర్లు, మంత్రులతో పాటు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

ఎన్‌డిఎ ముఖ్యమంత్రులు నితీష్ కుమార్, రంగస్వామి డుమ్మా

ఈ సమావేశానికి కేంద్రంలో అధికార ఎన్‌డిఎ కూటమికి చెందిన ఇద్దరు ముఖ్యమంత్రులు డుమ్మాకొట్టారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, పుదిచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి డుమ్మాకొట్టారు. అయితే పుదిచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి అసెంబ్లీ సమావేశాలు నిర్వహణ వల్ల హాజరు కాలేదని చెబుతున్నారు. అయితే పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 31న ప్రారంభం కానున్నాయి. జెడియు చీఫ్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ హాజరుకాకపోవడం దేశ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశమవుతోంది.

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న నితీష్ కుమార్ నీతి ఆయోగ్ సమావేశానికి డుమ్మా కొట్టడంపై చర్చలు జరుగుతోన్నాయి. బీహార్ తరపున డిప్యూటీ సిఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా హాజరయ్యారు. బీహార్‌కు కేంద్రం ప్రత్యేకహోదా కల్పించకపోవడమే ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు.


రాష్ట్రాలు జిల్లాలకు ఎక్కువ ఖర్చు చేయాలి : సిఈఓ బివిఆర్ సుబ్రమణ్యం

రాష్ట్రాలు జిల్లాలకు ఎక్కువ ఖర్చు చేయాలని నీతి ఆయోగ్ సిఈవో బివిఆర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. ముఖ్యమంత్రులు ఈ సమావేశానికి హాజరుకాకపోవడం వల్ల ఆయా రాష్ట్రాలకే నష్టమని అన్నారు. నీతి ఆయోగ్ సమావేశం ముగిసిన తరువాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బివిఆర్ సుబ్రమణ్యం మాట్లాడారు. ఈ సమావేశంలో డెమోగ్రాఫిక్ మేనేజ్‌మెంట్, జీరో పేదరికం అనే అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. రాష్ట్రాలు జిల్లాలపై ఎక్కువ ఖర్చు పెట్టాలని, తద్వారా అవి అభివృద్ధికి చోదకాలుగా మారాలని ప్రధాని కోరుకుంటున్నార న్నారు. కొన్ని రాష్ట్రాలు ప్రస్తావించిన 'జీరో పావర్టీ' ఆలోచనను ప్రధాని ప్రశంసించారని వివరించారు. దీనిని గ్రామ స్థాయిలో లక్ష్యంగా చేసుకోవాలని అన్నారు.నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ మాట్లాడుతూ పెట్టుబడులు అన్ని రాష్ట్రాలకు, ముఖ్యంగా తక్కువ విజయవంతమైన రాష్ట్రాలకు చేరుకోవడానికి వీలుగా ఎఫ్‌డిఐల కోసం రాష్ట్రాలు పోటీ పడాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

కొత్తగా ఏమీ ఇవ్వలేదు

హోదాకు బదులుగా క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్

- మిగిలినవి విభజన చట్టంలోనివే
- మీడియాతో చంద్రబాబు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం కొత్తగా ఇచ్చిందేమి లేదు. ప్రత్యేకహోదా ఇస్తామని కేంద్రం గతంలో హామీ ఇచ్చింది. దానికి బదులు క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్‌కు సహాయం చేస్తోంది. మిగిలిన అమరావతి, పోలవరం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి తదితరాలన్నీ విభజన చట్టంలో ఉన్నవే..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. నీతి అయోగ్ సమావేశంలో శనివారం పాల్గొన్న అనంతరం జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ను చంద్రబాబు కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఏదో ఇచ్చారని అందరూ అంటున్నారని, నిజానికి కొత్తగా ఇచ్చినవి ఏమీ లేవని చెప్పారు. 'అన్నీ పాత బకాయిలే.. విభజన చట్టంలోనివే..' అని అన్నారు. జలశక్తి మంత్రిని పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పూర్తిస్థాయి ప్రతిపాదన లకు ఆమోదం తెలపాలని కోరినట్లు చెప్పారు.

కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి అంగీకరించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మొదటి దశకు అవసరమైన రూ.12,500 కోట్ల ప్రతిపాదనలను వెంటనే ఆమోదించేలా చూడాలని కోరినట్లు తెలిపారు. జగన్ ఐదేళ్ల పాలన చూసి ప్రజలు ఎన్‌డిఎకి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టి, రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యత అప్పగించారని చెప్పారు. ఈ పర్యటనలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణతోనూ ఆయన నివాసంలో చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. వివిధ అంశాలపై సుమారు 20 నిమిషాల పాటు చర్చించారు.

తొలిరోజే చైనాకు 2 స్వర్ణాలు

- సైక్లింగ్‌లో ఆస్ట్రేలియాకు పసిడి
- పారిస్ ఒలింపిక్స్

పారిస్: 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కమ్యూనిస్టు చైనా తొలిరోజే రెండు స్వర్ణాలు సాధించి సత్తాచాటింది. గత ఒలింపిక్స్‌లో అమెరికాకు పతకాల్లో గండికొట్టిన చైనా.. ఈ ఒలింపిక్స్‌లో తొలిరోజునుంచే అగ్రస్థానం లక్ష్యంగా దూసుకెళ్తోంది. శనివారం జరిగిన 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్, మహిళల 3మీ. స్ప్రింగ్‌బోర్డు డైవింగ్‌లో చైనాకు పసిడి పతకాలు దక్కాయి. షూటింగ్ ఫైనల్లో చైనా బృందం హువాంగ్ యుటింగ్, షెంగ్ లియావో 16-12 పాయింట్ల తేడాతో దక్షిణ కొరియా షూటర్లు కీమ్ జీ హియాన్, పార్క్ హ జున్‌లపై గెలిచారు. 1996 తర్వాత షూటింగ్‌లో చైనాకు స్వర్ణ పతకం దక్కడం ఇదే తొలిసారి. రజతం దక్షిణ కొరియాకు, కాంస్యం కజకిస్తాన్‌కు దక్కాయి. మహిళల 3మీ. స్ప్రింగ్‌బోర్డులో చైనా ఐదు డైవ్‌లలో 337.68పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి రెండో బంగారు పతకాన్ని కైవసం చేసుకోగా.. అమెరికా 314.64పాయింట్లతో రజతం, బ్రిటన్ 302.28పాయింట్లతో కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాయి. ఇక ఆస్ట్రేలియా మహిళా సైక్లిస్ట్ 32ఏళ్ల గ్రేస్ 32.4కి.మీ. దూరాన్ని 39నిమిషాల 38:131సెకన్లలో గమ్యానికి చేరింది బంగారు పతకాన్ని ముద్దాడింది. ఈ విభాగంలో బ్రిటన్‌కు రజతం, అమెరికాకు కాంస్య పతకాలు దక్కాయి. తొలిరోజు ఆటలు ముగిసేసరికి చైనాకు రెండు, బెల్జియం, జపాన్, కజకిస్తాన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్‌కు ఒక్కో బంగారు పతకం దక్కాయి.

షూటింగ్ ఫైనల్‌కు మను బాకర్



భారత యువ షూటర్ మను బాకర్ 10మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగం ఫైనల్లోకి దూసుకెళ్లగా.. భారత పురుషుల హాకీ జట్టు 3-2గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఇక బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-8, 22-20తో కెవిన్ కోర్డాన్(గయానా)ను, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-17, 21-14తో ఫ్రాన్స్ జోడీని చిత్తుచేసి శుభారంభం చేశారు.

వైజాగ్ స్టీల్ @ వంద మిలియన్ టన్నులు

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మరో రికార్డు సాధించింది. 1990 నవంబరులో ఉత్పత్తిని ప్రారంభించిన ఈ పరిశ్రమ శనివారం నాటికి వంద మిలియన్ టన్నుల మైలురాయిని చేరుకుంది. ఇప్పటికే ఈ ప్లాంట్ పలు రికార్డులను సాధించింది. సహాయ, సహకారాలు అందిస్తే మరిన్ని రికార్డులు నెలకొల్పనుంది. కానీ, ఈ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. దీనికి వ్యతిరేకంగా కార్మికులు 1262 రోజులుగా పోరాడుతున్నారు. అయినా, కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ పీకనులిమేయాలనే చూస్తోంది. దీనిలో భాగంగా ముడిసరుకు అందకుండా చేయడం, ఉత్పత్తిని తగ్గించడం వంటి చర్యలకు పాల్పడుతోంది. ఈ ఏడాది 7.2 మిలియన్ టన్నుల ఉత్పత్తిని ప్లాంట్ సాధించాల్సి ఉంది. కానీ, ముడిసరుకు కొరత కారణంగా 2, 3 బ్లాక్ ఫర్నేస్‌లు మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో, అనుకున్న స్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు. ఇటీవల విశాఖ ఉక్కు పరిశ్రమలోని అన్ని విభాగాలనూ కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి పరిశీలించారు. ఈ పరిశ్రమను ప్రయివేట్‌పరం కాకుండా చూస్తామని, దీనిపై ప్రధాని దృష్టికి తీసుకెళ్తానని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే, కేంద్ర బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడలేదు. కర్మాగారం రికార్డు పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లలో 10,199 మంది బాలికల అదృశ్యం

శాసనసభలో ప్రభుత్వం వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆడపిల్లల ఆదృశ్యం ఆందోళన కలిగిస్తోంది. 2019 నుండి 2022 వరకూ రాష్ట్రంలో 10,199 మంది బాలికలు కనిపించకుండా పోయారు. వీరందరూ కూడా 18 ఏళ్లలోపు యువతులే కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల చట్టసభలో జరిగిన చర్చలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పటి వరకూ వారికి సంబంధించిన సంపూర్ణ సమాచారం ఏదీ గుర్తించలేకపోయారు. స్వచ్ఛంద సంస్థల సర్వేలో యువతులను ఉద్యోగాల పేరుతో ఎరవేసి, విదేశాలకు తీసుకెళ్లి అక్కడ వ్యభిచార గృహాల్లో అమ్మేస్తున్నారని పేర్కొన్నారు. ఇళ్లలో నుండి వేర్వేరు కారణాలతో వెళ్లిపోవడం, ప్రేమ పేరుతో ఎరవేసి ఇబ్బందుల్లోకి నెట్టడం వంటి కారణాలతో యువతులు అదృశ్యమవడం మరింత గగుర్పాటుకు గురిచేస్తోంది. గత నాలుగేళ్లలో దాదాపు 28 మంది యువతులు దారుణహత్యకు గురయ్యారు, వేల సంఖ్యలో వేధింపు లకు గురయ్యారు. తప్పిపోయిన వారి గురించిన ఇతర సమాచారాన్ని ఇప్పటి వరకూ ఎవరూ గుర్తించలేకపోయారు. దీనికోసం రాష్ట్రంలో సిఐడి నోడల్ ఏజెన్సీగా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. సుప్రీం కోర్టు 2012లో ఇచ్చిన ఆర్డర్ ప్రకారం తప్పిపోయారని ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేయాల్సి ఉన్నా ఆ కోణంలో ఇంకా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అదృశ్యమైన పిల్లల, తప్పిపోయిన పిల్లలకు సంబంధించిన వివరాలను 2012 నుండి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలకప్రాంతాల మధ్య మార్పు చేసుకునే అవకాశమూ కేంద్రం కల్పించింది. అయినా ఇప్పటికీ 10,199 మంది బాలికల జాడ తెలియడం లేదని చట్టసభలో ప్రభుత్వం వెల్లడించింది. ఎన్‌సిఆర్‌బి 2022లో ఇచ్చిన నివేదిక ప్రకారం అంతకుముందు సంవత్సరంలో 2,711 మంది మహిళలు అదృశ్యం అయ్యారు. 2022 సంవత్సరంలో 10,433 మంది మహిళలు మొత్తంగా 13,144 మంది అదృశ్యమైనట్లు కేసులు నమోదయ్యాయి. ఈ మొత్తం కేసుల్లో 2022 నాటికి 10,944 మందిని గుర్తించినట్లు నివేదికలో పొందుపరిచారు. ఇంకా గుర్తింపునకు దొరకని మహిళలు 2150 మంది ఉన్నట్లు తెలిపారు. ఎన్‌సిఆర్‌డి 2022 వరకే నివేదికలు ఇచ్చిందని, అనంతరం ఇంకా రాలేదని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం ప్రకారం రాష్ట్రంలో 10,199 మంది బాలికలు అదృశ్యం అయ్యారని, వారంతా 18 ఏళ్లలోపు వారేనని ప్రభుత్వం పేర్కొంది.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం

- దేశవ్యాప్తంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్టు
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

లోపలి పేజీలో..

పిఎన్‌బి లాభాల్లో 159 శాతం వృద్ధి

- తగ్గిన మొండి బాకీలు



కేంద్రం నుంచే నిధులు రాబట్టుకోవాలి

- అప్పులు ఉన్నాయనే సాకుతో పన్నులు పెంచొద్దు
- శ్వేతపత్రాలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, పక్కన సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రాలను చూస్తే, రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందనే భావన కలుగుతోందని, అప్పులు ఉన్నాయనే సాకుతో ప్రజలపై భారాలు వేయడం, పన్నులు పెంచడం వంటివి చేయవద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రాలపై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని సిఎం చంద్రబాబు చెబుతున్నారని, పరిస్థితి చూస్తుంటే భవిష్యత్తులో ఏమీ చేయలేమని, సర్దుకుపోవాలనే భావన కూడా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఆర్థిక లోటు భర్తీకి ఏం చేస్తారనేది స్పష్టత లేదన్నారు. రాష్ట్రానికి కావాల్సిన నిధులను కేంద్రం నుంచే రాబట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వం అప్పులు పాలైనా ఫర్వాలేదని, ప్రజలను అప్పుల పాలు చేయరాదని అన్నారు. ఇప్పటికే తలసరి అప్పు ఒక్కొక్కరిపై రూ.1.62 లక్షలు ఉందని తెలిపారు. ఈ తరుణంలో ఆదాయాలు, ఆర్థిక పరిస్థితులు ఎలా పెంచుకోవాలో ఆలోచించాలన్నారు. ఖజానా ఖాళీ అవడంపై శ్వేతపత్రాల్లో రాజకీయంగా విమర్శలు చేశారే తప్ప, ఆర్థిక లోటును పూడ్చుకునేందుకు చేపట్టే ప్రత్యామ్నాయ చర్యలు ఏమీ కనిపించలేదని, పాక్షిక సత్యాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు తప్ప, ఆర్థిక విధ్వంసానికి కారకులైన కార్పొరేట్ సంస్థల ప్రస్తావన లేదని తెలిపారు. రాష్ట్ర సంపదను అదానీకి, షిర్డీ సాయి, జెపి వంటి సంస్థలకు దోచిపెట్టారని, వాటిపై పన్నులు వేచి రాబట్టాలని అన్నారు. మన రాష్ట్రం గురించి కేంద్రం ఘనంగా మాటలు చెప్పి, బీహార్‌కు భారీగా నిధులు ఇచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంతమంది ఎంపీలు ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు. అమరావతికి రూ.15 వేల కోట్ల సాయంపైనా స్పష్టత లేదన్నారు. గ్రాంటా? లేక రుణమా? అనేది తేల్చకుండా ప్రజలను బిజెపి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌లో గ్రాంటుగా చెప్పలేదని గుర్తు చేశారు. ఫైనాన్సియల్ సపోర్టు అనే పదం వాడారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా మభ్యపెట్టే యత్నం కనిపిస్తోందని పేర్కొన్నారు. బ్రిక్స్ బ్యాంకు ప్రతినిధులు సిఎం చంద్రబాబును కలిశారని, దాని ద్వారా తీసుకునేది అప్పుగానే ఉంటుందని వివరించారు. విశాఖ ఉక్కును ప్రవేటీకరణ చేయబోమని చెబుతూ, బడ్జెట్ కేటాయింపుల్లో గతేడాది కన్నా రూ.74 కోట్లు తగ్గించారన్నారు. పోలవరం, విశాఖ మిగతా 5లో

గాజా పాఠశాలపై ఇజ్రాయిల్ దాడి

- 30 మంది మృతి

డీర్ అల్ బలాహ్ (గాజాస్ట్రిప్): గాజాపై ఇజ్రాయిల్ దాష్టీకాలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం సెంట్రల్ గాజాలోని ఒక పాఠశాలపైన, ఆసుపత్రిపైన జరిపిన బాంబు దాడిలో 30 మంది మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. గాజాలో కాల్పుల విరమణ గురించి అంతర్జాతీయ మధ్యవర్తులతో చర్చలు జరపడానికి ఒక రోజు ముందు ఇజ్రాయిల్ ఈ కిరాతకానికి పాల్పడడం గమనార్హం. కాల్పుల విరమణపై ఇటలీలో అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తులతో ఇజ్రాయిల్ అధికారులు ఆదివారం చర్చలు జరపనున్నారు. గత నాలుగు రోజుల్లో లక్షా 86వేల మంది పాలస్తీనీయులను ఇజ్రాయిల్ సైన్యం ఖాళీ చేయించింది. ఇంతలోనే వైమానిక బాంబు దాడులకు దిగడంతో ఖాన్ యూనిస్‌లో అనేక మంది చిక్కుకుపోయారని ఐరాస మానవతా సహాయక సంస్థ ప్రత్యేక దూత ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు సంపూర్ణ విజయం సాధించేవరకు గాజాపై దాడి ఆపేది లేదని యుద్ధ నేరస్తుడైన నెతన్యాహు హూంకరించాడు. ఆయన కేబినెట్‌లోని యూదు దురహంకార మంత్రులు మిగతా 5లో

'గోదావరి' మళ్లీ ఉగ్రరూపం

- భద్రాచలం వద్ద 3వ, ధవళేశ్వరం వద్ద 2వ ప్రమాద హెచ్చరికలు
- మరింత ముంపులోకి పోలవరం విలీన మండలాల్లోని గ్రామాలు
- పునరావాస కేంద్రాలకు, ఎత్తైన ప్రాంతాలకు తరలుతున్నబాధితులు
- ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు నిల్చిన రాకపోకలు



వరద నీటిలో మునిగిన కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలో మొల్లేటి వారి పాలెం



దాచారంలోని గోదావరి వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి, రామానాయుడు, అనిత

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలకు గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. రెండు రోజులుగా తగ్గినట్లే తగ్గి శనివారం మరోసారి పోటెత్తింది. గంటగంటకూ వరద ఉధృతి పెరుగుతుండడంతో పోలవరం విలీన మండలాలు మరింత ముంపునకు గురవుతున్నాయి. దీంతో, ఆయా గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వరద మరింత పెరగవచ్చనే అధికారుల హెచ్చరికలతో కొందరు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్తున్నారు. మరికొందరు కొండలు, గుట్టలు, ఎత్తైన ప్రాంతాల్లో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని తలదాచుకుంటున్నారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి 54 అడుగులు దాటి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో, అక్కడ మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద ప్రవాహం 14.20 అడుగులకు చేరుకుంది. దీంతో, మళ్లీ ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

175 గేట్లనుపైకి లేపి 13,46,507 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి, తొమ్మిది వేల క్యూసెక్కుల నీటిని తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 33.400 మీటర్లకు చేరింది. దీంతో, 11.65 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి పెరగడంతో మిగతా 2లో

పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైసిపి నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని శనివారం సాయంత్రం తిరుపతి పోలీసులు అరెస్టు చేశారు. చంద్రగిరి టిడిపి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో మోహిత్‌రెడ్డిని బెంగుళూరులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. ఎన్నికల అనంతరం పద్మావతి మహిళా యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించడానికి వెళ్లిన పులివర్తి నానిపై మోహిత్ రెడ్డి అనుచరులు ప్లాన్ ప్రకారం దాడి చేశారు. కారులో ఉన్న కెమెరాల్లో దాడి దృశ్యాలు నమోదయ్యాయి. ఈ ఘటనలో 17 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడిలో ప్రధాన నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరారీలో ఉన్నారు. 307 సెక్షన్ కింద ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మోహిత్ రెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బెంగళూరులో ఉన్నట్లుగా తెలియడంతో వెళ్లి అరెస్టు చేశారు.

టెట్‌కు 3.20లక్షల మంది దరఖాస్తు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు ఇప్పటి వరకు 3,20,333 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి టెట్ దరఖాస్తులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆగస్టు 3వ తేది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తు గడువు తేదీని పొడిగించే అవకాశం లేదని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు గడువు తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అక్టోబర్ 3 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ట్రిపుల్ ఐటి విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్
కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటి (డిఎం) విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన శనివారం కళాశాలలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నల్ల సాయి కార్తీక్ నాయుడు (20) ట్రిపుల్ ఐటిలో మూడో సంవత్సరం చదువుతున్నారు. వేసవి సెలవులు ముగియడంతో ఈ నెల 22 నుంచి మూడో తరగతులకు హాజరవుతున్నారు. రెండు రోజుల క్రితం అధ్యాపకులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు జిజిహెచ్‌కు తరలించారు. విద్యార్థి మృతి విషయాన్ని ట్రిపుల్ ఐటి యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సాయి కార్తీక్ ఆత్మహత్యకు కారణాలను ఆరా తీస్తున్నారు. విద్యార్థి జేబులో ఉన్న సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ
విద్యార్థి మృతి ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు.

ఎపిజిఇఎ తాత్కాలిక అధ్యక్షులుగా శ్రీకాంత్‌రాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణను బహిష్కరించి సంఘాన్ని కాపాడుకుంటున్నట్లు ఎపిజిఇఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు తెలిపారు. ఈ సంఘానికి తాత్కాలిక అధ్యక్షులుగా శ్రీకాంత్‌రాజు వ్యవహరిస్తారని ఆయన వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం

- దేశవ్యాప్తంగా ల్యాండ్ టైటిల్లింగ్ యాక్టు
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పేర్కొన్నారు. సిపిఎం ఆధ్వర్యాన కేంద్ర బడ్జెట్‌పై ఆన్‌లైన్‌లో విశ్లేషణ జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి స్థిరంగా బాగుందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న అంశాలు వాస్తవం కాదన్నారు. మౌలికపరమైన లోపాలు ఉన్నాయని, ఆర్థిక వ్యవస్థలో చాలా బలహీనతలు ఉన్నాయని ఆర్థిక సర్వేలో స్పష్టంగా పేర్కొన్నారని చెప్పారు. బడ్జెట్‌ను రాజకీయంగా వినియోగించే విధానాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. బడ్జెట్లో ఎపి, బీహార్‌కు మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువ నిధులు కేటాయించారనే విమర్శ సర్వత్రా వచ్చిందన్నారు. రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లను తగ్గిస్తున్నారని, దీనిపై ఆలోచించాలని చెప్పారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి నిధులు పెంచలేదన్నారు. ద్రవ్య లోటును 4.9 నుంచి 4.5 శాతానికి తగ్గిస్తామని ఆర్థికశాఖ మంత్రి పొందుపరిచారని, ఇది ప్రజలకు శాపమన్నారు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగ పెట్టుబడులే ఎక్కువగా ఉన్నాయని, ప్రైవేట్ పెట్టుబడులు దాదాపుగా లేవన్నారు. కేంద్రం 2019లో కార్పొరేట్ పన్ను రాయితీ భారీగా ఇచ్చిందని చెప్పారు. ఈ రాయితీలతో పాత అప్పులు తీర్చుకుని, మిగిలిన వాటిని సొంత ప్రయోజనాలకు కార్పొరేట్ కంపెనీలు ఉపయోగించుకుంటున్నాయని ఆర్థిక సర్వే చెప్పిందన్నారు. ఫ్యాక్టరీలు ప్రారంభించకుండా స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో వినియోగిస్తున్నారని, ఇది ప్రమాదకరమని సర్వే తెలిఇందన్నారు. ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులు పెట్టకుండా ఆర్థికపరిస్థితి మెరుగుపడే అవకాశం లేదన్నారు. ఇప్పటి ధోరణే కొనసాగితే రాబోయే కాలంలో ప్రజలకు కష్టాలు పెరుగుతాయని, నిరుద్యోగం మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ సదుపాయాలు కల్పిస్తామని చెప్పారని , అగ్రిస్టాక్ అనే సంస్కరణ తీసుకొచ్చి, ఇందులో రైతులందరినీ నమోదు చేసి ఐడి కార్డులు ఇస్తారని, భూమికి కూడా ఆధార్ కార్డు ఇచ్చి, రైతు కార్డుకు అనుసంధానం చేస్తారని వివరించారు. ఇది ల్యాండ్ టైటిల్లింగ్ యాక్టు వంటిదే అని చెప్పారు. దీనిని అమలు చేస్తే ప్రోత్సాహకాలు ఇస్తామని రాష్ట్రాలతో చేయించే ప్రయత్నం చేసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ఈ చట్టాన్ని రద్దు చేశారని, దీనిని సంస్కరించి కొత్త చట్టం తీసుకొస్తారని అన్నారు. భూ సంస్కరణలు, రద్దు చేసిన మూడు చట్టాలను వేరే రూపాల్లో అమలు జరిపేందుకు చట్టాలు తీసుకొచ్చేలా ఎకనామిక్ పాలసీ ఫ్రేం వర్కును రూపొందిస్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో వచ్చే సమస్యలను తీసుకుని ఉద్యమాలకు సిద్ధం కావాలనే సందేశం తీసుకెళ్లాలని చెప్పారు.

రాష్ట్రానికి లాభం లేదు : శ్రీనివాసరావు
కేంద్రం బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ప్రత్యేకంగా ఒరిగింది ఏమీ లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి సహాయం చేయాల్సిన కేంద్రం వివిధ సంస్థల నుండి సేకరించి ఇవ్వడం పెద్దమోసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థల ద్వారా వచ్చే అప్పులను 30 ఏళ్ల తరువాత తీర్చుకోవచ్చని చెబుతున్నారని తెలిపారు. అలా ఇస్తున్న రూ.15 వేల కోట్లు భారమే తప్ప మరొకటి కాదన్నారు. పోలవరం బాధ్యత కేంద్రానిదే అని చెప్పారని, భూసేకరణ, పునరావాసం బాధ్యత గురించి నోరెత్తడం లేదని పేర్కొన్నారు.

వీటి కేటాయింపులపై స్పష్టత లేదని చెప్పారు. విశాఖ ఉక్కుకు గతం కంటే రూ.63 కోట్లు, పోర్టుకు రూ.123 కోట్లు తగ్గించారని, వెనుకబడిన ప్రాంతాలకు కేటాయింపులు చేయలేదని అన్నారు. ప్రత్యేక హోదా అంశాన్ని మాట మాత్రంగానైనా కేంద్రాన్ని అడగలేదని అన్నారు. కేంద్ర బడ్జెట్ విషయంలో గతంలో వైసిపి తీసుకున్న వైఖరే ఇప్పుడు టిడిపి తీసుకుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం, ప్రోకార్పొరేట్, ప్రజావ్యతిరేక తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేంద్రం ఎలా అన్యాయం చేసిందన్న విషయాన్ని ప్రజలకు వివరించేలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాలన్నారు.

అప్పులపై జగన్ తప్పుడు మాటలు

- ప్రివిలేజ్ నోటీసు ఇస్తాం
- మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర అప్పులపై తప్పుగా మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శాసనసభ హక్కుల ఉల్లంఘన నోటీసు అందిస్తామని మాజీ మంత్రి, టిడిపి ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అన్నారు. హక్కుల కమిటీ ఏర్పాటవ్వగానే జగన్‌తో పాటు నిబంధనలు ఉల్లంఘించిన మీడియాకు అందిస్తామని చెప్పారు. టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి పీతల సుజాత, ఎమ్మెల్సీ అశోక్‌బాబుతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడకుండా జగన్ బయట మాట్లాడుతున్నారని అన్నారు. వైసిపి నేతలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇప్పుడు తాము చేయలేదంటూ బుకాయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాల్లో వాస్తవాలను వైసిపి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం విడుదల చేసే పత్రాలపై జగన్, వైసిపి చర్చకు రావాలని డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో దాదాపు రూ.14 లక్షల కోట్ల అప్పు తేలుతుందని, దీనిని ఎవరూ దాయలేరన్నారు. శ్వేతపత్రంలో కొన్ని మాత్రమే బయటకు వచ్చాయని, మరికొన్ని నివేదికలు రావాలని చెప్పారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన లెక్కలు ఖరారు కాలేదన్నారు. నాన్ గ్యారెంటీ రుణాలను కూడా చూపించలేదని చెప్పారు. ఈ కార్పొరేషన్‌ల లెక్కలను కాగ్‌కు ఇవ్వకపోవడంతో ఆడిట్ కాలేదని తెలిపారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, ఉద్యోగాలకు కట్టుబడి ఉందన్నారు.

వినతులు స్వీకరించిన నక్కా, నజీర్
ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, నజీర్ అహ్మద్ ప్రజల నుంచి టిడిపి కార్యాలయంలో శనివారం వినతులు స్వీకరించారు. వందల సంఖ్యలో వివిధ సమస్యలపై అర్జీదారులు వినతులు అందించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టిడిపి తరపున కొంతమందికి ఆర్థికసాయం చెక్కులను అందించారు. విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన టి శ్రావణి కుటుంబ పోషణకు వ్యాపార నిమిత్తం రూ.2 లక్షలు, గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన కె శేఖర్‌బాబు కుమారుడు చదువు నిమిత్తం రూ.50 వేలు అందించారు.

అబ్దుల్ కలాం.. యువతకు ఆదర్శం
భారతరత్న ఎపిజె అబ్దుల్‌కలాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని కుల, మతాలకు అతీతంగా దేశానికి సేవలు చేయాలని టిడిపి నేతలు అన్నారు. టిడిపి కార్యాలయంలో అబ్దుల్ కలాం వర్థంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశరక్షణ రంగాన్ని అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి కలాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, మాజీ మంత్రి పీతల సుజాత తదితరులు పాల్గొన్నారు.

300 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)
కారులో అక్రమంగా తరలిస్తున్న 300 కిలోల గంజాయిని విశాఖ జివిఎంసి 79వ వార్డు పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. తాడి - లంకెలపాలెం సమీపంలో అనుమానాస్పదంగా కారు తిరుగుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోదా చేయగా కారులో 150 బస్తాలతో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయితోపాటు కారులో ఉన్న రూ.10 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన కంబాల సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు సంతోష్ సింగ్ పరారవగా పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది. ఒడిశాలోని గుణుపూర్ జిల్లా పనస ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుబడినట్టు పోలీసులు తెలిపారు.

ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రుల బృందం పర్యటన

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్, వేలేరుపాడు రూరల్, తణుకు
గోదావరి వరదల కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటామని రాష్ట్ర మంత్రులు తెలిపారు. వరద ముంపునకు గురైన ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో రాష్ట్ర మంత్రులు కింజారపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు పర్యటించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సాయం అందిస్తుందని, ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. తొలుత దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలోని బాధితులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెదవాగు ప్రాజెక్ట్ మరమ్మతులకు రూ.80 కోట్లతో అంచనాలు రూపొందించగా, ప్రభుత్వం తన వాటా చెల్లించకుండా పెడచెవిన పెట్టిందని, దాని ఫలితంగా ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు. పెదవాగు ప్రాజెక్ట్ కారణంగా ముంపుబారిన పడకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వరద బాధితులకు పూర్తి స్థాయిలో సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వరద ప్రమాదం పూర్తిగా తగ్గేవరకూ బాధితులు పునరావాస కేంద్రాల్లో ఉండొచ్చని, వారికి ఏ సమస్యా రాకుండా అధికారులు చూసుకుంటారని అన్నారు. హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వరద సాయంగా బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.3 వేల నగదును బాధితులకు అందజేశారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా తణుకు నియోజకవర్గంలోని దువ్వ గ్రామంలో మంత్రులు పర్యటించారు. అత్తిలి మండలం వరిఘేడు, తిరుపతిపురం గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)
ఐక్య పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె అయోధ్యరామ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1262వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిస్థితి ప్రభుత్వాల తీరుతో రోజుకురోజుకూ ఆందోళనకరంగా మారుతోందని తెలిపారు. కొత్త ప్రభుత్వాలు వచ్చిన తరువాత విశాఖ ఉక్కుకు ఊపిరి వస్తుందని ఆశించినా అదేదీ కానరావడంలేదన్నారు. ప్లాంట్ పరిస్థితి రోజురోజుకూ మరింత దిగజారుతోందని తెలిపారు. ఇటువంటి తరుణంలో ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు, నిర్వాసితులు, ఉద్యోగులు మరింత ఉధృత పోరాటాలు నిర్వహించాల్సి ఉందన్నారు. పోరాట కమిటీ నాయకులు యు రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గంపై దాడి చేయాలని చూస్తోందని, ఉద్యమాలతో అడ్డుకుని తీరుతామని అన్నారు. ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించుకోవాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు తరాలకు స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగానే అందించాలంటూ కార్మికులు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారని, ఈ పోరాటం తప్పక విజయం సాధిస్తుందని ఆకాంక్షించారు.

ఎంఎస్ఎంఇలను బలోపేతం చేస్తాం

- కేంద్ర మంత్రి మురుగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సరళతరం చేయడంతో పాటు ఎంఎస్ఎంఇలను బలోపేతం చేసే దిశగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి మురుగన్ పేర్కొన్నారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌పై శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ముఖ్యంగా అమరావతికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. 23-24లో నమోదైన జిడిపి వృద్ధి రేటును పునాదిగా చేసుకుని దేశాన్ని మరింతగా అభివృద్ధి చేయడం లక్ష్యమని అన్నారు. రాబోయో రెండేళ్లలో దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల సహకారంతో యువతలో నైపుణ్యాభివృద్ధికోసం కొత్త కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ప్రకటించినట్లు కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ పేర్కొన్నారు. కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును పొందేందుకు వీలుగా పై కప్పు సౌర విద్యుత్తు ప్లాంట్‌లను ఏర్పాటు చేయడానికి ప్రారంభించిన ప్రదానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనకు విశేష స్పందన వస్తోందని తెలిపారు. జనాభా పెరుగుదల కారణంగా కొత్తగా అర్హత పొందిన 25వేల గ్రామీణ ప్రాంతాలకు ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన నాలుగో దశ కింద అన్ని వాతావరణాలను తట్టుకునే రహదార్లు నిర్మిస్తామని వెల్లడించారు.

నిబంధనల ప్రకారం జగన్‌కు ప్రతిపక్ష హోదా రాదు : కేంద్రమంత్రి మురుగన్
నిబంధనల ప్రకారం వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శాసనసభలో ప్రతిపక్ష హోదా దక్కదని కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ పేర్కొన్నారు. ఎన్‌డిఎ గెలుపును జగన్ మోహన్‌రెడ్డి జీర్ణించుకోలేకనే ఢిల్లీకి వచ్చి డ్రామాలు ఆడుతున్నారన్నారు. తమిళనాడు అభివృద్ధిని సిఎం స్టాలిన్ పట్టించుకోవడం లేదని, అందుకే నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకాలేదని అన్నారు. పశ్చిమ బెంగాల్, కర్నాటక రాష్ట్రాలు కూడా కేంద్రాన్ని వ్యతిరేకించడం కోసమే నీట్‌ను తప్పుపడుతున్నాయన్నారు.

మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పోలీసులను ఆదేశించారు. ఆయన కార్యాలయానికి వచ్చే ప్రజాఫిర్యాదులను శనివారం స్వయంగా పవన్‌కల్యాణ్ స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎన్‌టిఆర్‌కాలనీ, 6వ వార్డు, ఫస్ట్ లైన్ నుంచి కొందరు యువకులు బైక్స్‌పై ప్రమాదకరంగా తిరుగుతూ మహిళలను వేధిస్తున్నారంటూ పవన్‌కల్యాణ్‌కు లేఖ అందింది. లేఖను చదివిన వెంటనే డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వెంటనే స్పందించి తిరుపతి ఎస్‌పి సుబ్బరాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. మహిళలను వేధించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందించిన ఎస్‌పి డివిజన్ అధికారులకు ఆధేశాలిచ్చారు. వారు వెంకటగిరి ఎన్‌టిఆర్ కాలనీ వాసులతో మాట్లాడి వేధిస్తున్న వారి వివరాలు తీసుకున్నారు. బైక్స్‌పై మితిమీరిన వేగంగా ప్రమాదకరంగా సంచరిస్తూ వేధిస్తున్న వారిని పట్టుకోవడంతో పాటు వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

'గోదావరి' మళ్లీ ఉగ్రరూపం



తెలంగాణా, ఆంధ్రా సరిహద్దులోని బూర్గంపాడు-వేలేరు రహదారిపైకి చేరిన వరద నీరు

మొదటిపేజీ తరువాయి
ఏలూరు జిల్లాలోని విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రధాన రహదారులపైకి నీరు చేరింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు-భద్రాచలం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో భద్రాచలం వెళ్లే బస్సులను నిలిపివేశారు. వరద నీరు చుట్టుముట్టడంతో కుక్కునూరు మండలం ఎల్లప్పగూడెం, బాపన్నగూడెం, బెస్తగూడెం ఎస్‌సి కాలనీ ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. పునరావాస కేంద్రాల్లోని వారికి, వరద ప్రభావంతో కొండలు, గుట్టలపైకి చేరిన వారికి సాయం అందడంలో కొంత అలసత్వం జరుగుతుండడంతో బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చింతూరులో ఉంటూ పర్యవేక్షిస్తున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్
అల్లూరి జిల్లాలోని పోలవరం ముంపు మండలాలు మరింత ముంపులోకి చేరుకున్నాయి. దీంతో, మరిన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై పలుచోట్ల వరద నీరు చేరడంతో భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎటపాక మండలం రాయనపేట, నెల్లిపాక, నందిగామ, మురుమూరు, చెన్నంపేట రహదారులపై నీరు అధికంగా చేరింది. డొంకరాయి జలాశయం నుంచి నాలుగు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది. ఆ మండలంలో పలు గ్రామాలు ముంపు పెరుగుతోంది. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చింతూరులోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. విఆర్.పురం మండలం ఒడ్డుగూడెం వద్ద శబరి, గోదావరి కలిసే చోట వరద ఉధృతి మరింత ఎక్కువగా ఉంది. మరో మూడు అడుగులు వరద పెరిగితే ఎత్తున ఉండే విఆర్.పురం, రాజపేట, మొద్దులగూడెం, అన్నవరం గ్రామాలు కూడా మునిగే అవకాశముందని అక్కడి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే తమను పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యావసర సరుకులు, బరకాలు, కిరోసిన్, దోమతెరలు వంటివి ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. కూనవరం మండలం కూనవరం, టేకులబోరు కొండ్రాజుపేట, శబరి కొత్తగూడెం, టేకుబాక గ్రామాలు నేటికీ ముంపులోనే ఉన్నాయి.

భద్రాచలాన్ని మూడు వైపులా చుట్టుముట్టిన వరద
భద్రాచలం పట్టణాన్ని మూడు వైపులా చుట్టుముట్టింది. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. ఎగువ ప్రాంతంలోని మేడిగడ్డ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇంద్రావతి, ప్రాణహిత నదుల నుంచి భారీ స్థాయిలో వస్తున్న వరదకు తాలిపేరు, కిన్నెరసాని, జంపన వాగుల ఉధృతి కూడా తోడైంది.

మరో మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి
- విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- 1,08,085 ఎకరాల్లో అగ్రికల్చర్, 6,821 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలకు నష్టం

సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనాల ప్రకారం మరో మూడు రోజులు గోదావరికి వరద ప్రవాహం కొనసాగనుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. రాష్ట్ర కమాండ్ కంట్రోల్ నుంచి ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. సహాయక చర్యల్లో మూడు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఆరు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఉన్నట్లు తెలిపారు. అల్లూరి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఇప్పటి వరకు 21,051 మందిని ఖాళీ చేయించినట్లు పేర్కొన్నారు. 13,289 మందిని 82 పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. 273 మెడికల్ క్యాంపులు నిర్వహించామని, 3,126 ఆహార ప్యాకెట్లు, 2.86 లక్షల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణ, వివిధ ప్రాజెక్టులు, నదుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లోని 96 మండలాల్లో 525 గ్రామాలు వరదలకు ప్రభావితమయ్యాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ఆధారంగా 1,08,085 ఎకరాల్లో అగ్రికల్చర్, 6,821 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.



సురక్షిత ప్రాంతాలకు సామాన్లు తీసుకుని వెళ్లిపోతున్న విఆర్.పురం మండలం ఒడ్డుగూడెం కాలనీ వాసులు

శ్రీశైలానికి పోటెత్తుతున్న వరద

కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు పోటెత్తుతోంది. ఎగువ జూరాల నుండి 3,12,544 క్యూసెక్కులు, సుంకేసుల (తుంగభద్ర) నుంచి 99,736 క్యూసెక్కులు వస్తున్నాయి. శ్రీశైలం జలాశయానికి మొత్తం 4,12,280 క్యూసెక్కులు వస్తుండడంతో జలాశయ నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 866.40 అడుగులకు చేరింది. మన రాష్ట్రం పరిధిలోని కుడిగట్టు జలవిద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 12,779 క్యూసెక్కుల నీటితో 6.9085 మిలియన్ యూనిట్లు, తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 36,279 క్యూసెక్కుల నీటితో 18.087 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ఈ రెండు కేంద్రాల ద్వారా విద్యుదుత్పాదన అనంతరం దిగువ సాగరకు 48,958 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

లంకలను ముంచెత్తుతున్న వరద

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని లంకలను వరద నీరు ముంచెత్తుతోంది. లంకల్లోని ఆవాసప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. దీంతో, వారికి కంటిమీద కునుకు లేకుండా ఉంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో 80 ఇళ్లను వరద ముంచెత్తింది. ముమ్మిడివరం మండలం గురజాపులంక, లంక ఆఫ్ ఠానేలంక, కూనలంక, చింతల్లంక, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు, పి.గన్నవరం మండలం శివాయలంక, చినకందపపాలెంలో ఇళ్ల చుట్టూ నడుంలోతు నీరు చేరింది. ఆలమూరు మండలంలో బడుగువానిలంక, తోకలంక అయినవిల్లి మండలంలో పల్లపులంక, అయినవిల్లిలంక, శానిపల్లిలంక, పొట్టిలంకల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. రామచంద్రపురం మండలం కోటిపల్లిలంక పూర్తిగా ముంపునకు గురవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కపిలేశ్వరపురం మండలం నారాయణలంక, కేదార్లంక, కోరుమిల్లి, అద్దంకివారి లంకల్లోని పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. మామిడికుదురు మండలం అప్పనపల్లిలో బాలబాలాజీ ఆలయనికి వెళ్లే రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో, ఆలయాన్ని మూసేశారు. వరద నీటి ప్రవాహానికి అప్పనపల్లి పాటురేవు ప్రాంత చెరువుల్లోని మత్స్యసంపద కొట్టుకుపోయింది. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట, యలమంచిలి మండలాల్లోని పలు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలు నీట మునగడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కోనసీమ జిల్లా లంకల్లోని పంటలన్నీ కొట్టుకుపోయాయి. సుమారు ఆరు వేల ఎకరాల్లో కూరగాయలు, పండ్లు, పువ్వులు, తమలపాకుల పంటలకు నష్టం వాటిల్లింది. గోదావరి లంకల్లోని కొబ్బరి తోటల్లోకి వరద నీరు చేరింది. అక్కడ కొబ్బరికాయలను తరలించేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పశుగ్రాసం లేక పశువులు అల్లాడుతున్నారు. దీంతో పశువులను పడవలపై తరలిస్తున్నారు.

ఎమ్మెల్యే బంధువుల బరితెగింపు

- రూ.1188 కోట్ల విలువైన భూమిపై కన్ను
- జెసిబితో హెచ్చరిక బోర్డులు తొలగింపు
- అడ్డుకున్న దేవాదాయశాఖ ఉద్యోగులు



చదును పనులు జరుగుతున్న భూమిని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వంలోని ఓ ఎమ్మెల్యే సమీప బంధువులు బరితెగించారు. అనకాపల్లి జిల్లా కేంద్రం ఆర్‌టిసి బస్ కాంప్లెక్సు సమీపంలోని పూల్‌బాగ్‌లో రూ.1188 కోట్ల విలువైన దేవాదాయ భూములపై కన్నేసి ఆ భూమినంతా చాపచుట్టేద్దామని శనివారం రంగంలోకి దిగారు. విషయం బయటకు పొక్కడంతో మీడియా, స్థానికులు చేరడం, దేవాదాయశాఖ ఉద్యోగులు గట్టిగా ప్రతిఘటించడంతో ఒక్కొక్కరూ జారుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. అనకాపల్లి పూల్‌బాగ్‌లో విశాఖపట్నం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం (అంబికాబాగ్)కు చెందిన సర్వే నెంబరు 66 (టిడి నెంబరు 3274)లో 29.71 ఎకరాల భూమి ఉంది. అదంతా దేవాదాయశాఖ స్వాధీనంలో ఉన్నప్పటికీ తమకు చెందిన భూములంటూ ఓ ప్రజాప్రతినిధి బంధువులు వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడే ఒక ప్రయత్నం చేశారు. అవేవీ అప్పట్లో ఫలించలేదు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆ ప్రభుత్వంలో జనసేన భాగస్వామి కావడంతో సదరు ఎమ్మెల్యే అండదండలతో ఆ భూమినంతా స్వాధీనం చేసుకునేందుకు రంగంలోకి దిగారు. ఆ భూమంతా తమ స్వాధీనంలో ఉన్నట్టు చెప్పుకొచ్చారు. కోర్టు నుంచి స్టేటస్ కో వచ్చిందంటూ భూమి చుట్టూ జెసిబితో చదును చేయించడం ప్రారంభించారు. దేవాదాయశాఖ వేసిన సిమెంట్ స్తంభాలు, హెచ్చరిక బోర్డులను తొలగించారు. స్టేటస్ కో ఆర్డర్ వచ్చిందని చెప్పి, ఆర్డర్ చూపించకుండానే భయపెట్టి పనులు చేయాలని చూశారు. దీంతో, విషయం తెలుసుకుని దాదాపు 18 మంది దేవాదాయశాఖ ఉద్యోగులు అక్కడికి వచ్చి చదును పనులను అడ్డుకున్నారు. ఈలోపు మీడియా, స్థానికులు చేరడంతో భూమిలో పనులు చేస్తున్న వారంతా జారుకున్నారు.

దేవాదాయ శాఖ వద్ద ఆ భూమికి సంబంధించిన రికార్డులన్నీ పక్కాగా ఉన్నట్లు ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. సిసిఎల్ఎ కోర్టు, ఆర్‌డిఒ కోర్టులో సర్వే నెంబరు 66లోని 29.71 ఎకరాలు దేవాదాయశాఖకు చెందిన భూమిగా తీర్పులు రావడంతో 2022 సెప్టెంబరు నుంచి ఆ భూమిని దేవాదాయశాఖ స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. ఆ భూమి తమ స్వాధీనంలో ఉందని కోర్టును తప్పుదోవపట్టిస్తూ సదరు ఎమ్మెల్యే సమీప బంధువులు కోర్టుకు వెళ్లారు. కోర్టు నుంచి ఎటువంటి ఆర్డర్ రాకుండానే రూ.1188 కోట్ల విలువైన ఆ భూమిని లాగేసుకోవాలని చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూమిలో చదును పనులు చేసిన వారిపై ఉన్నతాధికారుల సూచన మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎఇఒ వి.రాంబాబు, ఎఇ కె.సూర్యనారాయణ, దేవాదాయ ఉద్యోగులు రమేష్, గణేష్ తెలిపారు.

భూములను పరిరక్షించాలి : సిపిఎం

దేవాదాయ భూములను ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఆయన పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, వివి.శ్రీనివాసరావుతో కలిసి దేవాదాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ దేవాదాయ భూమిని పరిరక్షించాల్సిన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఎమ్మెల్యేలు, ఎంపిలు స్పందించి దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. ఉదాసీనంగా వ్యవహరించి ప్రయివేటు వ్యక్తులపరమయ్యేలా చూస్తే పోరాటాలతో అడ్డుకుంటామని హెచ్చరించారు.

రికార్డుల దహనం కేసు వేగవంతం

- పోలీసుల అదుపులో 'పెద్దిరెడ్డి' అనుచరులు



అక్కులప్ప



జింకా వెంకటాచలపతి

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ రికార్డుల దహనం కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి ఇంట్లో సోదాలు చేపట్టిన అధికారులు పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శనివారం తెల్లవారుజామున పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ముఖ్య అనుచరుడు కావడం గమనార్హం. మరో ముఖ్య అనుచరుడు, పిఆర్ఓగా పని చేసిన సిటిఎం మిట్టపల్లి సర్పంచ్ ఈశ్వరమ్మ భర్త అక్కులప్ప ఇంట్లో సైతం అధికారులు సోదాలు నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. భూ కుంభకోణంలో అత్యంత కీలకంగా వ్యవహరించాడన్న ఆరోపణల నేపథ్యంలో అక్కులప్పను శనివారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇప్పటికే పూర్వపు ఆర్డీఓలు మురళి, హరిప్రసాద్ దస్త్రాల దహనం ఘటనలో ముఖ్య భూమిక పోషించారన్న అనుమానంతో సబ్ కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజను పోలీసులు తమ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సంగతి తెలిసిందే. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లోనూ సోదాలు చేపట్టి, అన్ని రికార్డులను పరిశీలించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు వైసిపి యువనేత మాధవరెడ్డి పేరు ఎక్కువగా వినపడటంతో ఆయన ఇంట్లోనూ సిఐడి అధికారులు సోదాలు చేసి పలు రికార్డులను, కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లను సీజ్ చేశారు. వైసిపి ప్రభుత్వంలో ఎపిఎండిసి చైర్‌పర్సన్‌గా విధులు నిర్వహించిన మదనపల్లె మాజీ మున్సిపల్ చైర్మన్ షమీమ్ అస్లామ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో విజయవాడలోని మైన్స్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కూడా చైర్‌పర్సన్‌గా ఉన్న షమీమ్ అస్లామ్ పాత్ర ఎంతవరకు ఉందో అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఆభరణాల వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూపు



న్యూఢిల్లీ : ఆదిత్య బిర్లా గ్రూప్ కొత్తగా ఆభరణాల వ్యాపారంలోకి ప్రవేశించింది. 'ఇంద్రియ' బ్రాండ్ పేరుతో ఈ రంగంలోకి వచ్చినట్లు తెలిపింది. దేశంలో ఆభరణాల వ్యాపారానికి రిటైల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం రూ.5,000 కోట్ల పెట్టుబడుల వ్యయం చేయనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. తొలుత ఢిల్లీ, ఇండోర్, జయపురలో నాలుగు స్టోర్లను తెరవనున్నామని.. వచ్చే ఆరు నెలల్లో 10 నగరాలకు విస్తరించనున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా వెల్లడించారు. 20 ఏళ్లుగా ఫ్యాషన్ రిటైల్, లైఫ్‌స్టైల్ పరిశ్రమలో తాము రాణిస్తున్నామన్నారు.

పిఎన్‌బి లాభాల్లో 159 శాతం వృద్ధి

- తగ్గిన మొండి బాకీలు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగైన ప్రగతిని కనబర్చుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) నికర లాభాలు 159 శాతం వృద్ధితో రూ.3,252 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,255 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.9,504 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ).. గడిచిన క్యూ4లో 10.23 శాతం పెరిగి రూ.10,476 కోట్లుగా చోటు చేసుకుంది. 2024 జూన్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 275 బేసిస్ పాయింట్లు తగ్గి 4.98 శాతానికి పరిమితమయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 138 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 0.60 శాతానికి తగ్గాయి. కరెంట్ ఎకౌంట్స్‌ను మెరుగుపర్చడానికి సెప్టెంబర్ ముగింపు కల్లా కార్పొరేట్ల కోసం మొబైల్ యాప్‌ను ఆవిష్కరించే యోచనలో ఉన్నామని పిఎన్‌బి ఎండి, సిఇఒ అతుల్ కుమార్ తెలిపారు. గడిచిన జూన్ త్రైమాసికంలో రిటైల్ రుణాల్లో 14.4 శాతం, గృహ రుణాల్లో 14.7 శాతం చొప్పున వృద్ధి చోటు చేసుకున్నట్లు తెలిపింది.

ఎన్‌టిపిసికి రూ.45,053 కోట్ల ఆదాయం

దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టిపిసి 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం(క్యూ1)లో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సంస్థ నికర లాభాలు 12 శాతం పెరిగి రూ.5,506.07 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.4,907 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ1లో సంస్థ మొత్తం ఆదాయం 48,981.68 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదే సమయంలో రూ.43,390.02 కోట్ల ఆదాయం ప్రకటించింది.

అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నం

- నిందితుడిని అరెస్టు చేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు (శ్రీ సత్యసాయి జిల్లా)

కొందరి వేధింపులు తాళలేక మినీ అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేరవచెరువు మండల పరిధిలోని వీరప్పగారి పల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... వీరప్పగారిపల్లికి చెందిన నాగమణి మూడేళ్ల క్రితం అంగన్‌వాడీ కార్యకర్తగా విధుల్లో చేరారు. ఇటీవల టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాగమణి కుటుంబానికి వ్యతిరేకంగా ఉన్న ఆంజనేయులు, మరికొంతమంది కలిసి ఆమెను అంగన్‌వాడీ పోస్టు నుంచి తప్పించాలని రాజకీయంగా ప్రయత్నాలు చేస్తున్నారు. నాగమణిని, ఆమె కుటుంబాన్ని మానసికంగా వేధింపులకు గురి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నాగమణి శనివారం అంగన్‌వాడీ సెంటర్‌లోనే సెల్ఫీ వీడియో రికార్డు చేసి పురుగుల మందు తాగారు. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నాగమణి పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.

ఈ మేరకు సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్ కుళ్లాయప్ప, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మాబున్నీసా, ప్రాజెక్టు కార్యదర్శి రంగమ్మ, తదితరులు ఓడిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఈ మేరకు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఖాజాబీకి, సిఐ రాజేంద్ర నాథ్, ఎస్ఐ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

మున్సిపాల్టీల్లో ఆర్థికసంఘ నిధుల మళ్ళింపు?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మున్సిపాల్టీల అభివృద్ధి కోసం ఆర్థిక సంఘం ఇచ్చిన నిధుల వినియోగంలో ఆశించిన ఫలితాలు రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. వరుస రెండు సంవత్సరాల్లో రెండు వేల కోట్లకు పైగా నిధులు వచ్చినప్పటికీ ఆశించిన విధంగా ఫలితాలు రాలేదని చెబుతున్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు కాకుండా ఇతర అవసరాలకు నిధులను వినియోగించినందువల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. పట్టణాల్లో తాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడం, గాలి కాలుష్యాన్ని నివారించడం, వ్యర్థాల నిర్వహణ వంటి పనుల కోసం 15వ ఆర్థిక సంఘం నిధులను అందించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 990 కోట్లు విడుదలైనట్లు తెలిసింది. ఇందులో 10 లక్షలకుపైగా జనాభా ఉన్న పట్టణ స్థానిక సంస్థలకు 211 కోట్లు, మిగిలిన మున్సిపాల్టీలకు 799 కోట్లు వచ్చినట్లు సమాచారం. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను మొత్తం 1,046 కోట్లు ఆర్థిక సంఘం కేటాయించగా, అందులో 10 లక్షలకుపైగా జనాభా ఉన్న ప్రాంతాలకు 223 కోట్లు, మిగిలిన మున్సిపాల్టీలకు 823 కోట్లు కేటాయించారు. 10 లక్షలకుపైగా జనాభా ఉన్న నగరాలకు 100 శాతం గ్రాంటుగా కేటాయించగా, ఇతర మున్సిపాల్టీలకు 40 శాతం గ్రాంట్లుగా ఉంటాయి. మిగిలిన 60 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. పది లక్షలకన్నా తక్కువ జనాభా ఉన్న ప్రాంతాలకు ఇచ్చిన 40 శాతం నిధులను జీతభత్యాలు, నిర్వహణ వ్యయానికి ఖర్చు చేయరాదన్న నిబంధన ఉంది. దానికి భిన్నంగా ఈ నిధులను ఇతర అవసరాలకు దారిమళ్లించినట్లు తెలుస్తోంది. అందుకే నగరాలు, పట్టణాల్లో నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నట్లు కొంతమంది అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు.

పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణకు ఆర్థిక సంఘం నిధులను వినియోగించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థల్లో 44.57 లక్షల కుటుంబాలు ఉండగా, వాటికోసం 1.21 కోట్ల డస్ట్‌బిన్‌లు ఏర్పాటుచేసినట్లు అధికారులు చెబుతున్నారు. 157 కోట్ల రూపాయల వ్యయంతో 131 చెత్త రవాణా కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 112 మాత్రమే ఏర్పాటుచేసినట్లు అధికారులు చెబుతున్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలంలోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ఐదవ గేట్ ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి శనివారం బటన్‌నొక్కి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాయలసీమ రీజన్‌కు పోతిరెడ్డిపాడు నుంచి సాగు, తాగు నీరు అందించేందుకు ముఖద్వారమని, నీరు ఎంతో విలువైనదని, రైతులు సాగు నీటిని వృథా చేయొద్దని కోరారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని నీటి విడుదల పెంచుతామన్నారు. ఎస్ఆర్‌బిసి, తెలుగుగంగ, కెసి కెనాల్, జిఎన్‌హెచ్ఎస్ ప్రధాన కాల్వల ద్వారా వెలుగోడు, గోరుకల్లు, అవుకు, గండికోట, బ్రహ్మసాగర్ తదితర రిజర్వాయర్లకు పోతిరెడ్డిపాడు ద్వారా అవసరమైన నీటిని విడుదల చేస్తామని తెలిపారు. వరి కంటే ఉద్యాన పంటలను సాగు చేయడం వల్ల నీరు ఆదా అవుతుందని, ఎక్కువ దిగుబడులు, అధిక ధరలు సాధించి రైతులకు లాభం చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్ఇ వెంకటరామయ్య, ఇఇ పార్థసారథి, డిఇ, రాజేంద్రకుమార్, ఎఇ విష్ణు వర్ధన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ నిర్మలమ్మ పాల్గొన్నారు.

సంపాదకీయం

క్రీడా స్ఫూర్తి

ఇప్పుడు ప్రపంచమంతా ఒలిపింక్ క్రీడల వైపు దృష్టి సారించింది. విభిన్న దేశాలు, భిన్న సంస్కృతులు, వ్యక్తులను ఒక చోట చేర్చడంలో ఒలింపిక్స్‌కు ఒక ప్రత్యేకత వుంది. ఒలింపిక్స్ కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదు-ఆ యా దేశాల అభివ్యక్తి, సంకల్పం, స్థితిస్థాపకత, స్నేహం. 'జీవితంలో ముఖ్యమైన విషయం విజయం కాదు పోరాటం. ఒలింపిక్ క్రీడల్లోనూ అంతే... గెలవడం కాదు, పాల్గొనడం' అంటారు ఆధునిక ఒలింపిక్ ఉద్యమ స్థాపకులు పియరీ డి కూబెర్టిన్. గమ్యం ఎంత కీలకమో ప్రయాణం కూడా అంతే కీలకం. కృషి, పట్టుదల, క్రీడా స్ఫూర్తి నేర్పిన పాఠాలు తుది ఫలితాలకు మించిన అనుభవాన్ని సుసంపన్నం చేస్తాయి. పురాతన గ్రీస్ నాటి గొప్ప చరిత్ర వున్న ఒలింపిక్ క్రీడలు...నేటి భౌగోళిక రాజకీయ సరిహద్దులను అధిగమించే వేదికగా పరిణామం చెందాయి. క్రీడాకారులు తమ దేశాల కీర్తి పతాకను రెపరెపలాడించేందుకు పోటీ పడతారు. 'జీవించడంలో ఉన్న గొప్ప మహిమ ఎప్పుడూ పడకపోవడంలో కాదు, పడిపోయిన ప్రతిసారీ లేవడంలోనే ఉంది' అంటారు నెల్సన్ మండేలా. ఇది క్రీడాస్ఫూర్తిని తెలియజేస్తుంది. ఈ స్థితప్రజ్ఞత...ఆటలో వైఫల్యం, గాయాలు, వ్యక్తిగత పోరాటాలను అధిగమించిన అథ్లెట్ల కథలతో నిండి ఉంటాయి. అథ్లెట్ల పట్టుదల, అంకితభావం, వారి విజయ గాథలు కోట్లాది మందికి స్ఫూర్తినిస్తాయి. అథ్లెట్లు పోడియంను పంచుకున్నప్పుడు బద్దలయ్యే ప్రపంచ రికార్డులు, ప్రదర్శనల ఉద్విగ్నక్షణాలు గుండె లోతుల్లో ప్రతిధ్వనిస్తాయి.

తాజాగా ప్రపంచమంతా ఆసక్తితో ఎదురు చూసిన పారిస్ ఒలింపిక్స్ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఒలింపిక్ గేమ్స్‌కు వందేళ్ల తర్వాత పారిస్ వినూత్న రీతిలో స్వాగతం పలికింది. ఒలింపిక్స్ చరిత్రలోనే తొలిసారి సెయిన్ నదిలో ఆరంభ వేడుకలు నిర్వహించి అబ్బురపరిచింది. క్రీడాకారులు అభివాదం చేస్తూ పడవల్లో ముందుకు సాగారు. ఒకవైపు ఒలింపిక్ జ్యోతితో వ్యక్తి ప్రయాణిస్తుంటూ...మరోవైపు వర్చువల్ సాంకేతికత మాయాజాలంతో ఫ్రాన్స్, పారిస్ చరిత్ర, సంస్కృతులను చాటేలా నదిపై ఆరు కిలోమీటర్ల మేర జరిగిన పరేడ్‌లో 85 పడవలపై 6800 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. 206 దేశాల నుంచి 10,500మంది అథ్లెట్లు, వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధులతో పాటు 3,20,000 మందికి పైగా ప్రేక్షకులు ఈ వేడుకలు చూసేందుకు హాజరయ్యారు. వాస్తవికతకు వర్చువల్ సాంకేతికతను జోడించి...జ్యోతిని చేపట్టిన ముసుగు వ్యక్తి పారిస్ వైభవాన్ని ప్రపంచానికి చాటేలా...అతను ఒక్కో ప్రదేశానికి వెళ్లినప్పుడు అక్కడి ప్రాధాన్యతలతో ఆకట్టుకునే ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. ప్యారిస్ అంటేనే ప్రేమ గుర్తు అని చెబుతారు. అలాంటి ప్రేమనగరి ప్రత్యేకతను తెలిపేలా ఆకాశంలో విమానాల పొగతో ఏర్పాటు చేసిన భారీ హృదయాకారం...ప్రేమికులకే కాదు, క్రీడాభిమానులకూ ఒక చిరస్మరణీయ జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఈ పరేడ్‌లో భారత్ బృందానికి నాయకత్వం వహించిన పి.వి సింధూ...మువ్వన్నెల జెండాతో అచ్చ తెలుగుదనాన్ని చాటి చెప్పింది.

ముఖ్యంగా ఒలింపిక్స్ సామాజిక, రాజకీయ, లింగ, వర్ణ వివక్షలకు వేదికగా మారాయి. సంవత్సరాలుగా అథ్లెట్ల జాతి, లింగ వివక్ష, మానసిక ఆరోగ్యం వంటి సమస్యలపై చర్చ జరుగుతూనే వుంది. 'ఇవాళ ఒలింపిక్స్ ప్రారంభోత్సవం. కానీ, ఒక ఆఫ్ఘన్ మహిళగా స్వేచ్ఛ కోసం నా పోరాటం ఒలింపిక్స్‌లో స్థానం కోల్పోయేలా చేస్తుందని గ్రహించలేకపోయాను. లింగవివక్షా పూరిత ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళ కల నెరవేరదు' అంటూ ఆఫ్ఘన్ తైక్వాండో అథ్లెట్ మర్జియే హమీదీ తన అసహాయతను పంచుకున్నారు. మహిళా అథ్లెట్లను లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ గతేడాది భారతీయ రెజ్లర్లు దేశ రాజధానిలో నిరసన దీక్షకు దిగిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు అథ్లెట్ల క్రీడా స్ఫూర్తిని, నైతికతను దెబ్బతీస్తాయి. దీనికి తోడు డోపింగ్, క్రీడాకారుల మానసిక ఆరోగ్యం, పర్యావరణ సమస్యలు వంటివి అంబరాన్నంటే సంబరాలను క్రీనీడలా కమ్ముకునే వుంటాయి. అసమానతలు, లింగ వివక్ష లేని సంస్కృతిని పెంపొందించడం ద్వారా క్రీడా స్ఫూర్తితో కూడిన ఒలింపిక్స్‌ను భావితరాలకు అందించాలి. 'కృషి వుంటే మనుషులు ఋషులవుతారు మహాపురుషులౌతారు/ తరతరాలకి తరగని వెలుగవుతారు ఇలవేలుపులౌతారు' అంటాడు సినీ కవి వేటూరి. క్రీడల్లోను, జీవితంలోనూ కృషి, పట్టుదల సంక్లిష్టమైన ప్రపంచంలో మనిషిగా నిలబెడుతుంది. ఉన్నత శిఖరాలను అధిరోహింపజేస్తుంది.

మహనీయుల మాట



దూరానికి...
ఆనందంగానూ,
దగ్గరికి...
విషాదంగానూ
కనిపించేదే జీవితం.

- చార్లీ చాప్లిన్



కేంద్ర నిరంకుశత్వమే కాశ్మీర్‌కు శాపం

ప్రస్తుతం



తెలకపల్లి రవి



కేంద్రం పెత్తనంలోకి వచ్చాక అన్నిటికన్నా తీవ్రమైన దెబ్బ తగిలింది మానవ హక్కులకే. కాశ్మీరియత్ అనే స్థానిక సంస్కృతిని, రాజ్యాంగంలో హామీ ఇచ్చిన ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం ప్రజలలో నిరసన పెంచింది. అంతకు ముందు అనేక మంది టెర్రరిజానికి వ్యతిరేకంగా మారారు. కానీ ఈ అసంతృప్తిని పెంచిన మోడీ సర్కారు చర్యలు, లెఫ్టినెంట్ గవర్నర్ నిరంకుశ పోకడలు మరోసారి విచ్ఛిన్న శక్తుల కుట్రలకు దేశ వ్యతిరేక శక్తులకు ఊతమిస్తున్నాయి. ఈ తప్పులను సరిదిద్దుకుని ప్రజలనూ పార్టీలనూ విశ్వాసంలోకి తీసుకోవడానికి బదులు సాయుధ బలగాలను ప్రయోగించి అణచివేత చర్యలను పెంచడం పరిస్థితిని మరింత దిగజార్చుతున్నది. సామాన్య పౌరులను నిఘా వర్గాలు వెంటాడుతున్నాయి. డిజిటల్ నిఘా పరాకాష్టకు చేరింది. పోలీసులు సాయుధ దళాల బెదిరింపులు నిత్యకృత్యమైనాయి.

జమ్మూ కాశ్మీర్‌లో 370వ అధికరణం రద్దుతో అద్భుతమైన అవకాశాలు ఆవిష్కరించబడినట్టు, అక్కడ అభివృద్ధి పరవళ్లు తొక్కుతున్నట్టు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం టముకు వేసుకుంటుంటే అక్కడ పరిస్థితులు మాత్రం వేగంగా దిగజారి పోతున్నాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో సంక్షోభం మాత్రమే గాక మానవ హక్కుల విషయంలోనూ ఈ దిగజారుడు తీవ్రమవుతుందని ప్రజాస్వామిక వాదులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపున టెర్రరిస్టు కార్యకలాపాలు పెరుగుతున్నాయంటూ కేంద్రం, సైన్యం అణచివేత చర్యలు తీవ్రం చేశాయి. ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ప్రత్యేకంగా ఉన్నత స్థాయిలో సమావేశమై సమీక్ష చేసి ఆఘమేఘాల మీద అక్కడకు అధునాతన సైనిక దళాలను పంపించాలని నిర్ణయించారు. ఈ ఏడాది మొదట్లో కాశ్మీర్‌లో పర్యటించి అంతా గొప్పగా వుందనే ఆర్భాటం చేసిన మోడీనే స్వయంగా అత్యవసర చర్యలు ప్రకటించడంలో పరిస్థితి తీవ్రతతో పాటు కేంద్రం వ్యూహం కూడా కనిపిస్తుంది. తీవ్రవాద కార్యకలాపాలకు స్థావరాలుగా వున్న చోట్లకు సాయుధ బలగాలను మొహరించాలనీ, పహారా నిఘా కార్యక్రమాలు ముమ్మరం చేయాలనీ ఆదేశించారట. మొత్తంపైన 500 మంది కమెండోలు, 2000 మేరకు ఇతర దళాలు ఈ ప్రత్యేక చర్యలో పాల్గొంటున్నట్టు సమాచారం. భద్రతా దళాలు, రాష్ట్ర పోలీసులు కలిసి గాలింపు చర్యలు ఇప్పటికే బాగా పెంచేశారు. అనుమానితులను విస్తారంగా అరెస్టులు చేస్తున్నారు. తీవ్రవాద కార్యకలాపాలను కాశ్మీర్ లోయ నుంచి జమ్మూ ప్రాంతంలోకి విస్తరించడం జరుగుతోందని కేంద్రం చెబుతున్నది. రాజకీయంగా జమ్మూలో బిజెపి కేంద్రీకరణ, స్థానాలు తెచ్చుకోవడం తెలిసిన విషయమే. గత ఏడాది ఏకపక్షంగా నియోజక వర్గాల పునర్విభజన జరిపినప్పుడు కూడా జమ్మూలోనే సీట్లు పెరగడం విమర్శకు కారణమైంది. బిజెపి మతతత్వ విభజన రాజకీయాలు దీనికి ఒక కారణమైతే రిజర్వేషన్ విధానం వల్ల గుజ్జార్లలో ఒక భాగం దూరం కావడం, గతంలో ఆఫ్ఘనిస్తాన్‌ను స్థావరంగా చేసుకున్న కొందరు తీవ్ర వాదులు ఇటు మరలిరావడం వంటి ఇతర కారణాలు కూడా కారణాలుగా చెబుతున్నారు.

జమ్మూలో పరిణామాలు

ఏమైనా ఇదేదో ఊహించని పరిణామం కాదు. కేంద్రం కాశ్మీర్ పట్ల అనుసరించిన అప్రజాస్వామిక విధానాలే పరిస్థితి దిగజారడానికి అసలు కారణమైనాయి. తీవ్రవాదాన్ని అణచివేసే పేరిట పౌర హక్కులపై దాడి చేయడం నిరసన పెంచుతున్నది. ఉదాహరణకు పూంచ్ జిల్లాలోనే సైనిక దళాలు ముగ్గురు పౌరులను అనుమానంపై నిర్బంధించడం, లాకప్‌లోనే వారు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర నిరసనకు దారితీసింది. ప్రధాని మోడీ పర్యటనకు ముందు కూడా అందరినీ అరెస్టు చేశారు. ఈ నిరంకుశ ధోరణి ఎంతవరకూ పోయిందంటే దశాబ్దాలుగా కాశ్మీరీలు ప్రత్యేకంగా నిర్వహించుకునే అమరవీరుల సంస్మరణ దినానికి కూడా అనుమతినివ్వలేదు. టెర్రరిజం పెరగడానికి కారణమైన పాలకులే దాన్ని సాకుగా చూపి...పౌరుల, పార్టీల హక్కులను అణచి వేస్తున్నారన్నమాట. సిపిఎం సీనియర్ నాయకుడు యూసఫ్ తరిగామి జమ్మూ కాశ్మీర్ పరిస్థితి దిగజారడానికి కారణాలేమిటో స్పష్టంగా తెలియజేశారు. అయిదేళ్ల నుంచి ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలు లేకుండా పోవడమే ఇందుకు కారణమవుతోందన్నారు. వివిధ రంగాలలో తీవ్ర సంక్షోభానికిది దారితీసింది. గతం కన్నా ధరలు, నిరుద్యోగం దారుణంగా పెరిగిపోవడమే గాక దారిద్ర్యం, అప్పుల భారం తాండవిస్తున్నాయి. కాశ్మీర్ లోయలో ఈ సమస్యలు రగులుతుంటే కేంద్రం మీడియా కూడా జమ్మూలో తీవ్రవాదం పెరుగుదల గురించి ఎక్కువగా మాట్లాడటం యాదృచ్ఛికం కాదు. గతంలోనూ వారి వ్యూహం అక్కడే కేంద్రీకృతమై వుంటోంది. కాశ్మీరీ పండిట్లపై హత్యలు అనేదాన్ని దేశ వ్యాపితంగా ఒక మతపరమైన కోణంలో చూపించడం అందులో భాగమే. వారి కోసం గట్టిగా నిలబడి ప్రాణాల మీదకు తెచ్చుకున్న వారిలో తరిగామి ముందున్నారు. అనేక దాడులను తట్టుకుని నిలబడినందుకే ఆయన జమ్మూ నుంచి వరుసగా నాలుగుసార్లు ఎంఎల్ఎ కాగలిగారు.

తలకిందులు వాదనతో...

రెండవసారి అధికారానికి వచ్చీ రాగానే మోడీ సర్కారు ఆర్టికల్ 370ని ఏకపక్షంగా రద్దు చేసింది. అంతేగాక కాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చింది. లడక్‌ను ప్రత్యేక ప్రాంతంగా విభజించింది. రాజ్యాంగ రీత్యా ఒక రాష్ట్ర విభజన హోదా మార్పు శాసనసభకు చెప్పి చేయాలి. అందులోనూ కాశ్మీర్ శాసనసభకు ప్రత్యేక ప్రతిపత్తి కూడా వుండింది. ఆ శాసనసభ ఉనికిలో లేనప్పుడు రాష్ట్రపతి పాలనలో భాగంగా గవర్నర్ రాజ్యం చేస్తున్నప్పుడు నిరంకుశంగా ఇవన్నీ కానిచ్చేశారు. మాజీ ముఖ్యమంత్రులతో సహా కీలక నేతలందరినీ జైళ్లపాలు చేసి గవర్నర్ చాటున బిజెపి అనుకూల మతతత్వ పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టికల్ 370 స్ఫూర్తిని సవ్యంగా అమలు చేయకుండా కేంద్రం పెత్తనం చేయడం కాశ్మీర్ సమస్యలకు మూలం. అందుకు పూర్తి విరుద్ధంగా కాశ్మీర్ వెనకబాటుకు ఆర్టికల్ 370 కారణమని దుష్ప్రచారం చేశారు. ఈ అధికరణం వల్ల కేంద్ర పథకాలు అమలు చేయడం సాధ్యపడటం లేదన్నారు. బయటివారు కాశ్మీర్‌లో వచ్చి వ్యాపారాలు, ఆస్తుల కొనుగోళ్లు చేయడానికి వీలు పడటం లేదన్నారు. పెట్టుబడులు రాకపోవడానికి అదే కారనంగా చూపించారు. దాన్ని రద్దు చేసిన అయిదేళ్ల తర్వాత ఇప్పుడు పరిస్థితి ఇంతగా దిగజారడం చూస్తే ఆ ప్రచారాలన్నీ కట్టుకథలని తెలిపోతుంది. ఎందుకంటే ఆర్టికల్ 370 వున్నా కేంద్ర పథకాలు అమలు చేయడానికి ఏ ఆటంకం వుండేది కాదు. గ్రామీణ ఉపాధి పథకం. ప్రధాని గ్రామీణ సడక్ యోజన వంటివి అక్కడ అమలవుతుండేవి. ఇక బయిటవారి పెట్టుబడులకు అది అడ్డంకిగా వుండేదన్న మాట కూడా నిజం కాదు. ఎన్నో దశాబ్దాలుగా కథువాలో బిర్లాల మిల్లు, శ్రీనగర్‌లో గ్రాండ్ లలిత్ హోటల్ వంటివి వుంటూనే వచ్చాయి. కేవలం కాశ్మీర్‌పై పూర్తి ఆధిపత్యం పెంచుకోవడానికి నేరుగా కేంద్రం పెత్తనంతో బిజెపి బలం పెంచుకోవడానికి మాత్రమే ఈ నాటకం నడిపించారు.

శాసనసభ ఎన్నికలెప్పుడు?

కేంద్రం పెత్తనంలోకి వచ్చాక అన్నిటికన్నా తీవ్రమైన దెబ్బ తగిలింది మానవ హక్కులకే. కాశ్మీరియత్ అనే స్థానిక సంస్కృతిని, రాజ్యాంగంలో హామీ ఇచ్చిన ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం ప్రజలలో నిరసన పెంచింది. అంతకు ముందు అనేక మంది టెర్రరిజానికి వ్యతిరేకంగా మారారు. కానీ ఈ అసంతృప్తిని పెంచిన మోడీ సర్కారు చర్యలు, లెఫ్టినెంట్ గవర్నర్ నిరంకుశ పోకడలు మరోసారి విచ్ఛిన్న శక్తుల కుట్రలకు దేశ వ్యతిరేక శక్తులకు ఊతమిస్తున్నాయి. ఈ తప్పులను సరిదిద్దుకుని ప్రజలనూ పార్టీలనూ విశ్వాసంలోకి తీసుకోవడానికి బదులు సాయుధ బలగాలను ప్రయోగించి అణచివేత చర్యలను పెంచడం పరిస్థితిని మరింత దిగజార్చుతున్నది. సామాన్య పౌరులను నిఘా వర్గాలు వెంటాడుతున్నాయి. డిజిటల్ నిఘా పరాకాష్టకు చేరింది. పోలీసులు సాయుధ దళాల బెదిరింపులు నిత్యకృత్యమైనాయి. మామూలు ప్రజల నుంచి మొబైల్ ఫోన్ నెంబర్లు తీసుకోవడం రివాజుగా మారింది. సుదీర్ఘ కాలం పాటు ఇంటర్నెట్ సౌకర్యంతో సహా సమాచార సంబంధాలు లేకుండా పోయాయి. ఎవరు ఏ కాస్త భిన్నస్వరం వినిపించినా విమర్శ చేసినా నిర్బంధం చుట్టుముడుతున్నది. ఎన్నికైన ప్రభుత్వం రాజకీయ కార్యకలాపాలు లేకపోవడంతో నిరంకుశాధికార వర్గం రాజ్యం చేస్తున్నది. వీరిపై ఎలాంటి అజమాయిషీ గానీ అదుపాజ్ఞలు గానీ లేకుండా పోయాయి. ఈ అంశాలు పార్లమెంటులోనూ సుప్రీం కోర్టు ముందు కూడా చర్చకు వచ్చాయి. ఆర్టికల్ 370 రద్దును సవాలు చేసే రాజ్యాంగ కేసును విపరీతంగా ఆలస్యం చేసిన సుప్రీం కోర్టు ఆఖరుగా అది చెల్లుతుందని తీర్పునివ్వడం నిరుత్సాహ పర్చింది. అయితే అదే సమయంలో సెప్టెంబరు 30 లోగా అక్కడ ఎన్నికలు జరిపి శాసనసభను ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

ప్రతిపక్షాల నిరసన

కాశ్మీర్‌లో జిల్లా అభివృద్ధి సంఘాలకు జరిగిన ఎన్నికలలో 'గుప్కార్ అలయన్స్' ఆధిక్యత సాధించగా బిజెపి జమ్మూలో ప్రభావం చూపించింది. మొన్నటి లోక్‌సభ ఎన్నికలలోనైతే జమ్మూలోని ఉద్దంపూర్, జమ్మూ స్థానాలు బిజెపి గెల్చుకోగా, శ్రీనగర్, అనంతనాగ్ రాజౌరి నేషనల్ కాన్ఫరెన్స్ తెచ్చుకుంది. కాశ్మీర్ లోయలోని బారాముల్లా స్థానం నుంచి పిడిపిపై నేషనల్ కాన్ఫరెన్స్ తరపున ఒమర్ అబ్దుల్లా విజయం సాధిస్తారని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా వేర్పాటువాద 'అవామీ ఇత్తెహాద్ పార్టీ' అభ్యర్థి, పూర్వపు ఎంఎల్ఎ షేక్ అబ్దుల్ రషీద్ ఇంజనీర్ స్వతంత్రుడుగా విజయం సాధించారు. ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయన ప్రత్యేకంగా కోర్టు ద్వారా వచ్చి ప్రమాణ స్వీకారం చేయడం మీడియాను ఆకర్షించింది. లోక్‌సభ ఎన్నికలలో వచ్చిన ఓట్ల ప్రకారం చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ 36 చోట్ల, బిజెపి 29 చోట్ల ఆధిక్యతలో వుండగా మొహబూబా మఫ్తీ పిడిపి కేవలం అయిదు చోట్ల, కాంగ్రెస్ ఏడు చోట్ల మాత్రమే ఆధిక్యత తెచ్చుకోగలిగాయి. కాంగ్రెస్, ఎన్‌సి 'ఇండియా' బ్లాక్‌లో వున్నా ఎన్నికల్లో విడివిడిగానే పోటీ చేశారు. ఈ రాజకీయ ఫలితాల ప్రభావం కూడా కేంద్ర బిజెపి చర్యలను ప్రభావితం చేస్తున్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. అందుకే సుప్రీం కోర్టు ఆదేశించినా ఏదో ఒక సాకుతో వాయిదా వేస్తూ వస్తోంది. పైగా లెఫ్టినెంట్ గవర్నర్ పాలనాధికారాలు నియామక అధికారాలు మరింత పెంచుతూ కొద్ది రోజుల కిందట హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. శాసనసభ ఏర్పాటు కావలసిన తరుణంలో ఈ విధంగా చేయడమంటే రేపు రాబోయే ప్రభుత్వ అధికారాలను ముందుగా కత్తిరించడమే. పారిశ్రామిక విధానాన్ని సవరించి మరింత సులభంగా భూములు, వాణిజ్య సంస్థలకు కేటాయించేందుకు గవర్నర్ యంత్రాంగం నిన్ననే తాజా ఉత్తర్వులు ఇచ్చింది. టెర్రరిజం అణచివేత పేరిట సైనిక దళాల చర్యలు, రాజకీయంగా గవర్నర్ అధికారాల పెంపు, కార్పొరేట్లకు నజరానాల పెంపు, మతపరమైన విభజన తీవ్రం చేయడం ఈ సమయంలో కేంద్ర బిజెపి వ్యూహంగా వుంది. ఒక విధంగా ఇది జరగాల్సిన దానికి పూర్తి భిన్నమైన దిశలో వుందని చెప్పాలి. జమ్ము కాశ్మీర్ ప్రతిపక్ష పార్టీలు ఈ ఏకపక్ష నిర్ణయాల విషయమై చర్చించేందుకు ఆగష్టు 7న సమావేశమవుతున్నాయి. ఈ లోగా కేంద్ర ప్రభుత్వం, బిజెపి నాయకత్వం ఏం చేస్తాయో చూడవలసి వుంటుంది.

★

'కన్వర్' పేరుతో మత విద్వేషం...

విశ్లేషణ

శారద

కన్వర్ యాత్రీకులు గందరగోళ పడకుండా ఉండేందుకు, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అనే పేరుతో దుకాణాల యజమానులు తమ పేర్లను ప్రముఖంగా రాసి ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. యోగి సర్కార్ ఉత్తర్వులు ముస్లింల కోసమేనని, మనకేంటి అని ఇతరులు ఎవరైనా భావిస్తే అంతకు మించిన పొరపాటు మరొకటి ఉండదు. చరిత్రను చూసినపుడు సనాతనం లేదా మనువాదం కారణంగా దళితులకు ఇతరుల వాడల్లో ప్రవేశం నిషేధించారు. ఒకవేళ అనుమతిస్తే ఉమ్మి వేయకుండా మెడలో ముంత ధరించాలని, వీపులకు చీపుర్లు కట్టుకొని ఊడ్చుకుంటూ నడిపించిన చరిత్ర దాస్తే దాగేది కాదు. ఇప్పుడు కన్వర్ పేరుతో మత విద్వేషం రెచ్చగొడుతున్నవారు మనువాదుల వారసులే. సనాతనాన్ని అమలు జరపాలని కోరే శక్తులకు ప్రతిఘటన లేకపోతే మళ్లీ పాత రోజులకు తీసుకెళ్లినా ఆశ్చర్యం లేదు.



జులై 22 నుంచి ఆగస్టు 6 వరకు జరిపే కన్వర్-కావడి యాత్రల సందర్భంగా ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరా ఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన వివాదాస్పద ఉత్తరువు అమలును సోమవారం నాడు సుప్రీం కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఇది బిజెపి హిందూత్వ ఎజెండాకు ఎదురు దెబ్బ, యాత్రలు జరిగే దారిలో ఉన్న దుకాణాలు, హోటళ్ల, పానీయాల దుకాణాల యజమానుల పేర్లను సంస్థల ముందు ప్రదర్శించాలని ప్రభుత్వాలు ఆదేశించాయి. వాటిలో హలాల్ ధృవీకరణ పత్రం ఉన్న పదార్థాలను విక్రయించరాదని కూడా పేర్కొన్నారు. యాత్రల పవిత్రతను కాపాడేందుకు అని చెబుతున్నప్పటికీ అధికారిక ఉత్తరువుల్లో శాంతి భద్రతలను సాకుగా చూపారు. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశం ప్రకారం పేర్ల ప్రదర్శనకు బ్రేకు పడింది. అయితే ఆహార పదార్థాల స్వభావాన్ని వినియోగదారులకు ప్రదర్శించాలని కోర్టు పేర్కొన్నది. పోలీసులు తీసుకున్న చర్యలతో ఆందోళనకర పరిస్థితి ఏర్పడిందని, సామాజికంగా వెనుకబడిన తరగతులు, మైనారిటీలను ఆర్థికంగా విడదీస్తుందని పిటీషనర్ల తరపున వాదించిన సి.యు సింగ్ చెప్పారు.

పౌరహక్కుల పరిరక్షణ సంస్థ (ఎపిసిఆర్) పేరుతో ఉన్న ఒక స్వచ్ఛంద సంస్థ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీం కోర్టు తలుపు తట్టింది. ప్రభుత్వ ఉత్తరువుల కారణంగా దుకాణాల యజమానుల మత పరమైన గుర్తింపు వెల్లడి కావటమేగాక ముస్లిం మతానికి చెందిన దుకాణాల యజమానుల పట్ల వివక్ష ప్రదర్శించటమే అని పిటీషన్‌లో పేర్కొన్నారు.

తాజా లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అయోధ్యతో సహా అనేక చోట్ల చావు దెబ్బ తిన్నది. దీనికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కారణమంటూ కేంద్ర పెద్దల మద్దతుతో బిజెపి స్థానిక నేతలు ధ్వజమెత్తటమే కాదు. నాయకత్వ మార్పు జరగాలని కోరుతున్నారు. మరోవైపున దానికి ప్రతిగా యోగి కూడా తన అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. వాటిలో కన్వర్ యాత్రల ఆదేశం ఒకటి. జులై 22 నుంచి ఆగస్టు ఆరవ తేదీ మధ్య హరిద్వార్ సమీపానున్న గంగానది నుంచి తెచ్చే నీటి పాత్రలను కావళ్లలో పెట్టి తీసుకువస్తారు గనుక దీనికి 'కావడి యాత్ర' అనే పేరు వచ్చింది. వివిధ రాష్ట్రాల నుంచి వేర్వేరు మార్గాల్లో భక్తులు హరిద్వార్ వస్తారు. ఈ మార్గాల్లో యాత్రీకుల కోసం వస్తువుల దుకాణాలు, ఆహార పదార్థాల హోటళ్లు, దాబాలు, బండ్లు ఏర్పాటు చేస్తారు. కాలి నడకన, మోటారు వాహనాలు ఇలా ఎవరికి వీలైన పద్ధతుల్లో వారు ఈ యాత్రలో పాల్గొంటారు.

దుకాణాలు, హోటళ్ల ముందు యజమానుల పేర్లకు బదులు 'మానవత్వం' అని ప్రదర్శించాలని ప్రముఖ నటుడు సోనూ సూద్ ఎక్స్‌లో సూచన చేశారు. దీని మీద బాలీవుడ్ హీరోయిన్, బిజెపి లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ స్పందిస్తూ ఉమ్మిన ఆహారం, ఆ పని చేసేవారిని సమర్థించటమే ఇదంటూ ధ్వజమెత్తారు. ముస్లింలు తయారు చేసే ఆహారం, విక్రయించే పండ్లు మొదలైన వాటి మీద ఉమ్ముతారని, హలాల్ చేస్తారని, అపవిత్రమైన వాటిని హిందువులు బహిష్కరించాలని, హిందువుల పవిత్ర స్థలాలు, గుడులు గోపురాలు ఉన్న ప్రాంతాలలో ముస్లింల దుకాణాలను అనుమతించరాదని, ఇప్పటికే ఉంటే ఎత్తివేయాలని హిందూత్వ సంస్థలు ఎప్పటి నుంచో రెచ్చగొడుతున్న సంగతి తెలిసిందే. సాధారణ పౌరులెవరూ వాటిని పట్టించుకోవటం లేదన్నది కూడా ఎరిగిందే. అయోధ్యలో రామాలయం పేరుతో యోగి సర్కార్ బుల్డోజర్లతో కూలదోయించిన కట్టడాల్లో హిందువులవి కూడా ఉన్నాయి. అందుకే అక్కడ బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయటం, అభ్యర్థి ఓటమి తెలిసిందే.

ఉమ్ముతారని చేస్తున్న ప్రచారం వాస్తవం కాదు. నిజమే అయితే రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న అనేక బిర్యానీ హోటళ్లకు, రంజాన్ మాసం సందర్భంగా హలీం కోసం ఎగబడేవారిలో ఎక్కువ మంది ముస్లిమేతరులే ఎందుకు ఉంటున్నారు? దుకాణాలలో విక్రయించే వస్తువులు నాణ్యమైనవా కాదా? హోటళ్లలో వడ్డించే ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా? అన్నది గీటురాయిగా ఉండాలి తప్ప యజమానుల వివరాలు ఎందుకు? ఒకవేళ ముస్లిం మతానికి చెందిన వారు యజమానులుగా ఉంటే వాటిని బహిష్కరించాలని పరోక్షంగా చెప్పటమే ఇది. పేర్ల ప్రదర్శన ఒక్క ముస్లింలనే దెబ్బ తీస్తుందా? హిందువులను కూడా నష్టపరుస్తుంది. దుకాణాలపై దళితులు, గిరిజనులు, వెనుకబడిన సామాజిక తరగతులకు చెందిన యజమానుల పేర్లను ప్రదర్శిస్తే ముస్లిం దుకాణాల పట్ల అనుసరించే వైఖరినే మనువాద కులాల వారు పాటిస్తారని వేరే చెప్పనవసరం లేదు.

ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ యు.పి ప్రభుత్వ చర్యను తప్పు పట్టారు. ఒక మతపరమైన యాత్ర సందర్భంగా దుకాణాలు, హోటళ్ల యజమానుల పేర్లను ప్రముఖంగా వాటి ముందు రాసి ఉంచాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. సమీప భవిష్యత్‌లో ఇది వాహనాలకు సైతం వర్తింప చేస్తారని, గతంలో నాజీ జర్మనీలో కొన్ని దుకాణాలు, ఇళ్లకు ఇలాంటి గుర్తింపును అమలు చేశారని జావేద్ అక్తర్ ఎక్స్‌లో స్పందించారు. బిజెపి నేత, కేంద్ర మాజీ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ కూడా తప్పు పట్టారు. ఇది అంటరానితనాన్ని ప్రోత్సహించటం తప్ప వేరు కాదన్నారు. యోగి ఆదిత్యనాథ్‌ను నేరుగా విమర్శించలేని నక్వీ దీనికి అధికార యంత్రాంగం కారణమని విరుచుకు పడ్డారు. సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్, బిఎస్‌పి నాయకురాలు మాయావతి, మజ్లిస్ నేత అసదుద్దీన్ ఒవైసీ కూడా విమర్శించారు. ఇది సామాజిక నేరమని, కోర్టులు కలగచేసుకొని నివారించాలన్నారు. తొలుత యజమానుల పేర్లను ప్రదర్శించాలని అధికారులు ఆదేశించారు. దాని మీద విమర్శలు రావటంతో కాదు స్వచ్ఛందంగా చేయాలన్నారు. స్వచ్ఛందంగా అన్నప్పటికీ అంతిమ ఫలితం మతపరమైన గుర్తింపును విధిగా వెల్లడించేట్లు చేయటమే. ముస్లింలు పేర్లు రాసుకొని ప్రదర్శిస్తే వారి దగ్గర కొనవద్దని చెప్పేందుకు తప్ప దీనిలో శాంతి భద్రతల సమస్య ఎక్కడుంది? యాత్రికులకు ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకంటూ ముజఫర్ నగర్ ఎస్.పి ప్రకటన సాకు మాత్రమే. కావాల్సిన వస్తువు లేదా ఆహారం ఎవరి దగ్గర కొనుగోలు చేస్తేనేం, దానిలో యాత్రీకులు పడే గందరగోళం ఏమిటి?

ఇప్పుడు కన్వర్ యాత్రీకులు గందరగోళ పడకుండా ఉండేందుకు, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అనే పేరుతో దుకాణాల యజమానులు తమ పేర్లను ప్రముఖంగా రాసి ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. యోగి సర్కార్ ఉత్తర్వులు ముస్లింల కోసమేనని, మనకేంటి అని ఇతరులు ఎవరైనా భావిస్తే అంతకు మించిన పొరపాటు మరొకటి ఉండదు. చరిత్రను చూసినపుడు సనాతనం లేదా మనువాదం కారణంగా దళితులకు ఇతరుల వాడల్లో ప్రవేశం నిషేధించారు. ఒకవేళ అనుమతిస్తే ఉమ్మి వేయకుండా మెడలో ముంత ధరించాలని, వీపులకు చీపుర్లు కట్టుకొని ఊడ్చుకుంటూ నడిపించిన చరిత్ర దాస్తే దాగేది కాదు. ఇప్పుడు కన్వర్ పేరుతో మత విద్వేషం రెచ్చగొడుతున్నవారు మనువాదుల వారసులే. సనాతనాన్ని అమలు జరపాలని కోరే శక్తులకు ప్రతిఘటన లేకపోతే మళ్లీ పాత రోజులకు తీసుకెళ్లినా ఆశ్చర్యం లేదు. కాదంటారా!

కవిత్వం

బడ్జెట్

తిమ్మిని బమ్మిని చేయడం
మసిపూసి మారేడు కాయని చెప్పడం
మాయ చేసి మతి పోగొట్టడం
కళ్ళు మూసి జెల్ల కొట్టడం
ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు
భ్రమ కల్పించి గోల్ మాల్ చేయడం
టక్కుటమార విద్యలతో...
టముకు వాయించుకోవడం
ప్రతి బడ్జెట్ లోనూ జరిగే తంతిది
అయినా చెవులొగ్గి వింటూ వుంటాం
కళ్ళప్పగించి చూస్తూ వుంటాం
పెదవి విప్పం, పన్నెత్తి మాట్లాడం
అందుకే బడ్జెట్ అవుతోంది
ప్రతి ఏటా మొక్కుబడి తద్దినం
బడ్జెట్ అంటే అదేదో...
బ్రహ్మ పదార్థం కాదు
జనబాహుళ్యపు
భావి గతి నిర్దేశనం
మెతుకు చెబుతుంది
అన్నం గతి ఏమైందో...
బడ్జెట్ చెబుతుంది
ప్రభువుల వైఖరి ఎలా వుందో...
కాకుల్ని కొట్టి గద్దలకి పంచడం
ప్రజలెన్నుకున్న పార్లమెంటు సాక్షిగా
ఏటికేడు జరుగుతున్న ప్రహసనం
ఏలిన వారి చిత్తానికి వదిలేస్తే...
కాదా మరి ప్రజాస్వామ్యం పరిహాసం.

- వి.రాజగోపాల్,
విజయనగరం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com

జమ్మూకాశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్

- సైనికుడి మృతి
- పాక్ చొరబాటుదారుడు హతం

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి శనివారం ఉదయం ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక సైనికుడు ప్రాణాలు కోల్పోయాడు. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటనలో పాకిస్తాన్ చొరబాటుదారుడు హతమయ్యాడని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. మచాల్ సెక్టార్‌లో ప్రతికూల వాతావరణం, వెలుతురు సరిగా లేకపోవడాన్ని అవకాశంగా తీసుకొని ఇద్దరు, ముగ్గురు సాయుధ చొరబాటుదారులు దేశంలోకి చొరబాటుకు ప్రయత్నించారని, సమీపం నుండి సైనిక పోస్టుపై కాల్పులు జరిపారని వివరించింది. అప్రమత్తమైన సైనికులు ఎదురు కాల్పులు జరపగా ఒక చొరబాటుదారుడు హతమయ్యాడు. ఘటనా స్థలంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు లభించాయి. ఎదురు కాల్పుల్లో ఇద్దరు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని శ్రీనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా ఒకరు గాయాలతో మరణించారు. మరొకరు కోలుకుంటున్నారని, అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నదని సైన్యం తెలిపింది.

అనంత్‌నాగ్‌లో రోడ్డు ప్రమాదం

- ఎనిమిది మంది మృతి

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది మరణించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఐదుగురు చిన్నారులు ఉన్నారు. చిన్నారులంతా ఆరు నుంచి 16 ఏళ్ల వయస్సు ఉన్నవారు. అనంత్ నాగ్ జిల్లాలోని దక్సుమ్ ప్రాంతంలో శనివారం ఒక వాహనం అదుపుతప్పి లోయలో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాదానికి గురైన ప్రైవేటు వాహనం టాటాసుమో కిష్త్వార్ వైపు నుంచి మర్వా వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ తన వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

అలాంటి వ్యక్తి .. మన హోం మంత్రి

- శరద్ పవార్ విమర్శలు

ముంబయి : కేంద్ర హోం మంత్రి అమిత్ షా తనపై చేసిన ఆరోపణలకు ఎన్‌సిపి (ఎస్‌పి) పార్టీ చీఫ్ శరద్‌పవార్ ఘాటుగా ప్రతిస్పందించారు. స్వంత రాష్ట్రం నుంచి అమిత్‌షాను సుప్రీంకోర్టు రెండేళ్లపాటు బహిష్కరించిందని, అలాంటి వ్యక్తి మన హోం మంత్రి అని శరద్ పవార్ విమర్శించారు. శనివారం జరిగిన పార్టీ సమావేశంలో శరద్‌పవార్ మాట్లాడుతూ 'కొన్నిరోజుల క్రితం హోంమంత్రి అమిత్‌షా నాపై ఆరోపణలు చేశారు. 'దేశంలోని అవినీతి పరులందరికీ కమాండర్' అని ఆయన నన్ను పిలిచారు. ఒక కేసులో అమిత్‌షాను గుజరాత్ నుంచి రెండేళ్లపాటు సుప్రీంకోర్టు నిషేధించింది. నాడు సొంత రాష్ట్రం నుంచి కోర్టు నిషేధించిన వ్యక్తి నేడు కేంద్ర హోంమంత్రిగా ఉన్నారు. అలాంటి వ్యక్తి నుంచి నాకు సర్టిఫికెట్లు అవసరం లేదు. నా గురించి మాట్లాడే హక్కు ఆయనకు లేదు.' అని అన్నారు. దీన్నిబట్టి 'మనం ఎటువైపు వెళ్తున్నామో ఆలోచించాలని తెలిపారు. ఈ దేశం ఎవరి చేతుల్లో ఉందో, ప్రజలు తప్పుదారిలో పయనిస్తున్న తీరు మనం ఆలోచించాలి. లేదంటే వారు దేశాన్ని తప్పుడు మార్గంలో తీసుకెళ్తారని నాకు వందశాతం నమ్మకం ఉంది. మనం దీనిపై దృష్టి పెట్టాలి.' అని అన్నారు. 2010లో సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసుకు సంబంధించి అమిత్‌షాను సొంత రాష్ట్రం నుంచి రెండేళ్లపాటు సుప్రీంకోర్టు నిషేధించింది. ఈ కేసులో 2014లో నిర్దోషిగా అమిత్ షా విడుదలయ్యారు.

పుంజుకుంటున్న హారిస్

- తాజా పోల్స్‌లో ట్రంప్‌తో హోరాహోరీ

వాషింగ్టన్ : నవంబర్ ఐదవ తేదీన జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్న ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ బలం పుంజుకుంటున్నారు. తాజా పోల్స్‌లో ఆమె రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధిక్యతను తగ్గించగలిగారు. కమలా హారిస్‌కు తన పార్టీ నుండే కాకుండా శ్వేతజాతీయులు కాని ఓటర్ల నుండి కూడా మద్దతు గణనీయంగా పెరుగుతోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ తాజా సర్వే ప్రకారం హారిస్‌కు 49 శాతం, ట్రంప్‌కు 47 శాతం మద్దతు లభించింది. అయితే 3.1 శాతం పాయింట్ల మేర ఫలితాలు అటూ ఇటూ కావచ్చునని ఆ పత్రిక తెలిపింది.

ఈ నెల ప్రారంభంలో ట్రంప్ తన ప్రత్యర్థి, దేశాధ్యక్షుడు జో బైడెన్‌పై ఆరు పాయింట్ల ఆధిక్యత కనబరిచారు. అయితే ఆ తర్వాత బైడెన్ పోటీ నుండి వైదొలిగిన సంగతి తెలిసిందే. కాగా న్యూయార్క్ టైమ్స్/సియానా కాలేజ్ పోల్ ఈ నెల 22-24 తేదీల మధ్య 1,142 మంది ఓటర్ల అభిప్రాయాన్ని సేకరించింది. ఇందులో ట్రంప్‌నకు 48 శాతం, హారిస్‌కు 47 శాతం మద్దతు లభించింది. రిజిస్టర్డ్ ఓటర్లలో ట్రంప్‌కు 48 శాతం, హారిస్‌కు 46 శాతం మంది మద్దతు ఇస్తున్నారని వివిధ పోల్ సర్వేలు తెలిపాయి. గతంలో రిజిస్టర్డ్ ఓటర్లలో బైడెన్ కంటే ట్రంప్‌కు తొమ్మిది శాతం పాయింట్ల ఆధిక్యత లభించింది. ఇదిలావుండగా కమలా హారిస్ శనివారం తన అభ్యర్థిత్వానికి సంబంధించిన పత్రాలపై అధికారికంగా సంతకం చేశారు. 'ప్రతి ఓటును గెలుచుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తాను. నవంబరులో మా ప్రజల ప్రచారం విజయం సాధిస్తుంది' అని ఆమె ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

దేశప్రజలందరికీ ద్రోహం

- కేంద్ర బడ్జెట్‌తో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల పట్ల వివక్ష
- తమిళనాడు సిఎం స్టాలిన్ ధ్వజం
- మంచి ప్రభుత్వం అంటే ఓటు వేయని వారి కోసం కూడా పనిచేయాలి
- గత పది ఏళ్ళ నుండి ఒక్క ప్రాజెక్ట్ లేదు



చెన్నై : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తమిళనాడు ప్రజలను మాత్రమే కాకుండా, దేశ ప్రజలందర్నీ మోసం చేసిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శనివారం విమర్శించారు. బడ్జెట్‌లో కేంద్రం తమిళనాడుకు సవతి తల్లిగా వ్యవహరించినందుకు నిరసగానే తాను నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరించనట్లు స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు శనివార స్టాలిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'బిజెపి తన కుర్చీని కాపాడుకోవడానికే బడ్జెట్‌ను సమర్పించింది. నేను కేవలం తమిళనాడు ప్రజల మనోభావాలను వినిపించడం లేదు. దేశ ప్రజల స్వరంగా చెబుతున్నాను. మీరు ఒకదాని తరువాత ఒకటి తప్పులు చేస్తున్నారు. అదేవిధంగా ఓటమి తరువాత ఓటమిని ఎదుర్కొంటారు. పార్లమెంట్ ఉభయ సభల దృశ్యాలను చూసిన ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. బిజెపి దీనికి సమాధానం చెప్పాలి' అని తెలిపారు. 'నేను న్యాయం కోరవల్సి వచ్చినందున, నేను దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్నాను' అని స్టాలిన్ తెలిపారు. ఉత్తమ ప్రభుత్వం అనేది తమకు ఓటు వేసిన వారి కోసం మాత్రమే కాకుండా, ఓటు వేయని వారి కోసం కూడా పని చేయాలని స్టాలిన్ మరోసారి పునరుద్ఘాటించారు. 'బిజెపి ప్రభుత్వానికి విశాల దృక్పథం లేదు. తాజా బడ్జెట్ బిజెపి రాజకీయ ఉద్దేశాలను స్పష్టంగా సూచిస్తుంది' అని స్టాలిన్ విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమిళనాడును నిరంతం నిర్లక్ష్యం చేస్తోందని, తమిళనాడుకు కేంద్రం మంజూరు చేసిన చివరి ప్రాజెక్టు మదురైలోని ఎయిమ్స్ అని, 10 ఏళ్ల తరువాత కూడా దాని అసంపూర్ణ స్థితి గురించి ప్రజలకు తెలుసునని స్టాలిన్ అన్నారు. 2021 బడ్జెట్‌లో మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశను అమలు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిందని, అయితే ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని చెప్పారు.

ఎన్నికైన ప్రభుత్వాలపై గవర్నర్లు పెత్తనం ఆపాలి

- మంత్రివర్గం సిఫార్సులకు గవర్నర్ కట్టుబడి ఉండాలి
- రాజ్యసభలో సిపిఎం ఎంపిలు బ్రిట్టాస్, ఎఎ రహీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలపై గవర్నర్ల పెత్తనం ఆపాలని, మంత్రివర్గ సిఫార్సులకు గవర్నర్ కట్టుబడి ఉండాలని సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీం పేర్కొన్నారు. గవర్నర్‌లు ఛాన్సలర్‌షిప్, ఇతర రాజ్యాంగేతర పదవులను చేపట్టకుండా రాజ్యాంగంలో సవరణలు కోరుతూ సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ ప్రైవేట్ మెంబర్స్ బిల్లును శుక్రవారం బిజెపి సభ్యులు అడ్డుకున్నారు. మరో సిపిఎం ఎంపి ఎఎ రహీం కార్యనిర్వాహక పనితీరులో జోక్యం చేసుకోకుండా గవర్నర్ల అధికారాలను నియంత్రించే ప్రైవేట్ సభ్యుల బిల్లును ప్రవేశపెట్టారు. ఎంపి రహీమ్ రాజ్యాంగ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టారు. అసెంబ్లీ విశ్వాసంతో మంత్రి పదవిలో కొనసాగుతారని, గవర్నర్ ఇష్టంతో కాదని పేర్కొన్నారు. రహీమ్ బిల్లులోని అంశాలను వివరించనందున, అది ఎలాంటి అభ్యంతరాలు లేకుండా సాగింది. అయితే ఎంపి జాన్ బ్రిట్టాస్ తాను ప్రవేశపెట్టే బిల్లుపై క్లుప్తంగా మాట్లాడుతున్నప్పుడు, వెంటనే ట్రెజరీ బెంచ్ (అధికార పార్టీ ఎంపిలు) అడ్డుకున్నారు. గవర్నర్‌ను రాష్ట్రపతి ప్రతినిధిగా పరిగణిస్తారని, మంత్రిమండలికి కట్టుబడి ఉండాలని కోరితే రాష్ట్రపతికి హక్కు ఎక్కడిదని వాదిస్తూ బిల్లును ప్రవేశపెట్టడాన్ని బిజెపి ఎంపి సుదాన్సు త్రివేది వ్యతిరేకించారు. అయితే, జాన్ బ్రిట్టాస్ బిల్లును సమర్థిస్తూ గవర్నర్లు మంత్రుల మండలి సలహా మేరకే పని చేయాలని వివిధ కమీషన్లు చేసిన వ్యాఖ్యలు, పరిశీలనలు ఉన్నాయని చెప్పారు. "ఇప్పుడు జరుగుతున్నది ఏమిటంటే, ఎన్నుకోబడిన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గవర్నర్లు వ్యవహరిస్తున్నారు" అని బ్రిట్టాస్ పేర్కొన్నారు. అయినా ఈ బిల్లుపై బిజెపి ఎంపిలు అభ్యంతరం వ్యక్తం చేసి, బిల్లు ప్రవేశపెట్టడంపై ఓడింగ్ కోరారు. దీంతో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ ఓటింగ్ నిర్వహించారు. 21-56 ఓట్ల తేడాతో బ్రిట్టాస్ బిల్లును ప్రవేశపెట్టలేకపోయారు.

కేరళలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం, గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ మధ్య విబేధాల నేపథ్యంలో ఈ రెండు బిల్లులు రాజ్యసభ ముందుకు వచ్చాయి. గవర్నర్ ఛాన్సలర్‌గా విశ్వవిద్యాలయాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే నిరంతరం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. యూనివర్శిటీలపైన తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు, అలాగే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేసేందుకు బిల్లులపై సంతకాలు చేయటం లేదు. దీంతో కేరళ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీం కోర్టు ఆదేశాల తరువాత కొన్ని బిల్లులపై సంతకాలు చేశారు. ఇలాగే మరికొన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాతను గవర్నర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

వచ్చే నెలలో ఉక్రెయిల్‌లో మోడీ పర్యటన ?

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే నెలలో ఉక్రెయిన్‌లో పర్యటిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. 2022లో రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత మోడీ ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లడం ఇదే మొదటిసారి కానుంది. శనివారం సమాచారం ప్రకారం ఆగస్టు 24న ఉక్రెయిన్‌లో మోడీ పర్యటించే అవకాశం ఉంది. ముందుగా పోలెండ్ వెళ్లి, తరువాత అక్కడకు మోడీ చేరుకోనున్నారు. ఇటీవల ఇటలీలో జరిగిన జీ-7 సదస్సు సందర్భంగా ప్రధాని మోడీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ సమావేశమయ్యారు. సదస్సులో ఇరువురు నేతలు పరస్పరం ఆలింగనం చేసుకోవడం కూడా కన్పించింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు మోడీకి జెలెన్స్కీ ఫోన్ చేసి అభినందించారు. తమ దేశంలో పర్యటించాలని కోరారు. మార్చిలో జెలెన్స్కీకి మోడీ ఫోన్ చేసి ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే అంశంపై చర్చించారు. చర్చలు, దౌత్య ప్రయత్నాల ద్వారానే రష్యాతో నెలకొన్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. మోడీ ఈ నెల ప్రారంభంలో రష్యాలో కూడా పర్యటించి దేశాధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యారు.

దివాళా దిశగా అమెరికా ?

వాషింగ్టన్ : అమెరికాకు అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు ఉంది. అయితే ఈ గుర్తింపునకు అప్పులు కూడా ఒక కారణం. ఏంటీ..ఆశ్చర్య పోతున్నారా? అవును..అమెరికా అప్పులతోనూ ఎదిగినట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఏటా ఆ దేశం కట్టే వడ్డీలే అందుకు నిదర్శనం. జూన్ 2024 లెక్కల ప్రకారం..దేశీయంగా వసూలైన వ్యక్తిగత ఆదాయపు పన్నులో 76 శాతాన్ని జాతీయ రుణాన్ని చెల్లించేందుకే అమెరికా వెచ్చిస్తోంది. ఈ వార్తలను ధ్రువపరిచేలా ప్రముఖ వ్యాపారవేత్త ఇలాన్ మస్క్ 'అమెరికా దివాలా దిశగా ప్రయాణిస్తోంది' అంటూ స్పందించారు. దాంతో ఈ ట్వీట్ మరింత వైరల్‌గా మారింది.



పెరుగుతున్న జాతీయ రుణం అమెరికాలో చాలా కాలంగా ప్రధాన సమస్యగా ఉంది. మస్క్ ఈ విషయాన్ని గతంలోనూ చాలాసార్లు తెలిపారు. తాజాగా 'అమెరికా దివాళా దిశగా వెళ్తోంది' అంటూ పీటర్ స్టాంజ్ అనే వ్యక్తి అప్‌లోడ్ చేసిన పోస్ట్‌లోని వివరాలను ధ్రువపరుస్తూ స్పందించారు. అమెరికా వ్యక్తిగత ఆదాయపన్ను వసూళ్లలో దాదాపు 76 శాతం జాతీయ రుణ చెల్లింపులకే ఖర్చు చేస్తున్నట్లు పీటర్ చెప్పారు. అమెరికా అప్పుల్లో కూరుకుపోయేందుకు కారణం మాజీ అమెరికా అధ్యక్షులు ఫ్రాంక్లిన్ డీ రూజువెల్ట్, రిచర్డ్ నిక్సన్ అని అన్నారు. 1970 కాలంలో అమెరికా ప్రెసిడెంట్‌గా ఉన్న రిచర్డ్ నిక్సన్ దేశీయ విధానాల కంటే విదేశీ వ్యవహారాలపై ఎక్కువ ఆసక్తి చూపేవాడు. ఓటర్లు తమ సొంత ఆర్థిక స్థితిపైనే దృష్టి సారిస్తారని నమ్మాడు. అప్పటికే దేశంలో పెరిగిన ద్రవ్యోల్బణం తిరిగి తన ఎన్నికకు ముప్పుగా మారుతుందని గ్రహించాడు. దాంతో 'న్యూ ఫెడరలిజం' విధానాలు అమలు చేశాడు. అందులో భాగంగా రాష్ట్రాలకు ప్రత్యేకంగా గ్రాంట్లను ప్రతిపాదించాడు. ఫలితంగా అమెరికా అప్పులు పెరిగిపోయాయి. రూజ్‌వెల్ట్ అధ్యక్ష పదవిలో ఉన్నపుడు సంపన్నులపై పన్ను రేట్లను 79%కు పెంచారు. ధనవంతులు ఈ రేటును తగ్గించుకోవడానికి ఇతర మార్గాలను ఎంచుకున్నారు. దాంతోపాటు అమెరికాలో ప్రైవేట్ పెట్టుబడులు తగ్గాయి. ఫలితంగా ఉద్యోగ కల్పన కుంటుపడింది. నిరుద్యోగం పెరిగింది.

వెనిజులా అధ్యక్ష ఎన్నికలు నేడు

- అంతర్జాతీయ పరిశీలకుల రాక
- మదురో , గొంజాలెజ్ మధ్యే పోటీ

కారకస్: వెనిజులా అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈ ఎన్నికలు ఎంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు వెనిజులా ఎన్నికల సంఘం అంతర్జాతీయ పరిశీలకులను ఆహ్వానించింది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల నుండి వెయ్యి మంది దాకా పరిశీలకులు ఇప్పటికే వెనిజులా చేరుకున్నారు. అధ్యక్షుడు మదురోకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాల బహుళజాతి , కార్పొరేట్ ప్రచార బాకాలు అసత్య ప్రచారాన్ని అదే పనిగా సాగిస్తున్నాయి. ఒక అబద్ధాన్ని పది సార్లు వల్లిస్తే నిజమైపోతుందని పాశ్చాత్య మీడియా భావిస్తున్నట్లుగా ఉంది. షెడ్యూల్ ప్రకారం ఆరేళ్లకొకసారి ఎన్నికలు నిర్వహించడం, ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు దేశీయ, విదేశీ పరిశీలకులను రప్పించడం వంటివి ఎన్నికల్లో పారదర్శకతకు నిదర్శనమని ఎన్నికల సంఘం (సిఎన్‌ఇ) ప్రెసిడెంట్ ఎల్విస్ అమోరసా తెలిపారు. ఈ ఎన్నికల్లో పది మంది దాకా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నప్పటికీ ప్రధాన పోటీ అధ్యక్షుడు మదురో, యూనిటరీ డెమొక్రటిక్ ప్లాట్‌ఫామ్‌కు చెందిన ఎడ్మండో గొంజాలెజ్ మధ్యే ఉంటుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. మొత్తం 2.1 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



లావోస్ రాజధాని వియంటైన్‌లో శనివారం జరిగిన అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్స్ నేషన్స్ (ఆసియాన్) విదేశాంగ మంత్రుల సమావేశం దృశ్యం.

ప్రవాస భారతీయులకు చేదు వార్త

వాష్టింగ్టన్ : అమెరికాలో నివాసం ఉంటున్న ప్రవాస భారతీయులకు మరో చేదు వార్త. ఆ దేశంలో ఉన్న చట్టబద్ధమైన వలసదారుల పిల్లలు, దాదాపు 2.50 లక్షలమంది అమెరికాను వీడే పరిస్థితి కనిపిస్తోంది. 'డాక్యుమెంటెడ్ డ్రీమర్స్' గా పిలిచే ఈ పిల్లలు తాత్కాలిక ఉద్యోగ వీసాలపై వారి తల్లిదండ్రులతో అమెరికా వచ్చారు. కానీ ఇప్పుడు 21 ఏళ్లు నిండిన (ఏజింగ్ ఔట్) కారణంగా ఆ పిల్లలు తమ డిపెండెంట్ స్థితిని కోల్పోయే ప్రమాదం ఉందన్న అంచనాలు ఆందోళన రేపుతున్నాయి. ఈ అంశానికి రిపబ్లికన్లను కారణమని వైట్ హౌస్ ఆరోపించింది. డాక్యుమెంటెడ్ డ్రీమర్స్‌కు సహాయం చేసేందుకు తాము ఒక ప్రక్రియను ప్రతిపాదించామని దాన్ని రిపబ్లికన్లు రెండుసార్లు దానిని తిరస్కరించాని అని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్-పియర్ చెప్పారు. చట్టసభ సభ్యులు, న్యాయవాదులు అమెరికాలో పెరిగిన పిల్లలను రక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు.

హెచ్ 1బీ కేటగిరీ కింద అమెరికాలో ఉండే విదేశీయుల పిల్లలకు హెచ్4 వీసా ఇస్తారు. ఇది పిల్లలకు 21 ఏళ్లు వచ్చేంతవరకు చెల్లుతుంది. భారతీయ పిల్లలు కనీసం 2.50 లక్షల మంది 21 ఏళ్లు నిండగానే అమెరికా వీడాల్సి ఉంటుంది. వారక్కడే ఉండాలంటే స్టూడెంట్ (ఎఫ్) వీసా సంపాదించాలి.లేదా కొత్త తాత్కాలిక స్థితికి మారాలి లేదా భారత్‌కు తిరిగి వచ్చేయాలి. లేదంటే అమెరికాలో ఉండటానికి చట్టపరమైన హోదా కోల్పోతే, అమెరికా చట్టాల ప్రకారం వారిపై చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ ద్వారా అమెరికా పౌరసత్వం, వలస సేవల సమాచారం ప్రకారం తమపై ఆధారపడిన వారితో సహా 1.2 మిలియన్లకు పైగా భారతీయులు మొదటి, రెండవ, మూడవ ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డ్ కేటగిరీలలో వేచి ఉన్నారు. కాగా జూన్ 13న, ఇమ్మిగ్రేషన్, పౌరసత్వం, సరిహద్దు భద్రతపై సెనేట్ జ్యుడిషియరీ సబ్‌కమిటీ చైర్‌గా ఉన్న సెనేటర్ అలెక్స్ పాడిల్లా నేతత్వంలోని బృందం ప్రతినిధి డెబోరా రాస్, వీరి రక్షించడానికి తక్షణ చర్య తీసుకోవాలని బైడెన్ ప్రభుత్వాన్ని కోరారు.



యువశక్తితో ఇండియా

- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇండియా యువశక్తి నిండిన దేశమని, దేశ మానవ వనరులు యావత్ ప్రపంచానికి ఆకర్షణగా నిలిచాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిష్కరణతో వెలవెలబోయిన ఈ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ, ఇండియా యువశక్తితో కూడిన దేశమని, ఇక్కడి మానవ వనరులు యావత్ ప్రపంచానికి ఆకర్షణగా నిలిచాయని అన్నారు. వికసిత్ భారత్ -2024 విజన్‌ని ముందుకు తీసుకెళ్లేందుకు నీతి ఆయోగ్ తొమ్మిదో పాలక మండలి సమావేశం శనివారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ . నైపుణ్యాలు, పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలు, ఉద్యోగాలకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. అన్ని రాష్ట్రాల సమిష్టి కృషితో వికసిత్ భారత్ - 2047 సాధించగలమని అన్నారు. ఈ దిశగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి ఇది తొలి మెట్టు అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనేది ప్రతి భారతీయుడి ఆశయమని, అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను రూపొందించేందుకు సరైన దిశలోనే పయనిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు, ప్రజలతో నేరుగా అనుసంధానం అయి ఉన్నందున, ఈ లక్ష్యాన్ని సాధించడంలో క్రియాశీల పాత్ర పోషిస్తాయని వివరించారు. నీతి ఆయోగ్ పాలక మండలి 9వ భేటీలో మోడీ ప్రసంగించారు. వందేళ్లలో ఒకసారి వచ్చే మహమ్మారిని ఓడించామని అన్నారు.. అంతర్జాతీయ పెట్టుబడులకు అనుకూలంగా మన విధానాలు మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సెలవిచ్చారు.

వాస్తవాలకు దూరంగా ఆర్‌బీఐ లెక్కలు

న్యూఢిల్లీ : మూలధనం, కార్మికులు, ఇంధనం, సామగ్రి, సేవలపై (కేఎల్‌ఈఎంఎస్) విడుదలైన రిజర్వ్‌బ్యాంక్ తాజా సమాచారం దేశంలో ఉపాధి పరిస్థితిపై విస్తృత చర్చకు దారితీసింది. దేశంలో నిరుద్యోగిత రేటు 9.2 శాతం ఉన్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియా ఎకానమీ సంస్థ అంచనా వేసిన నేపథ్యంలో ఈ నివేదికపై ఆర్థికవేత్తలు చర్చోపచర్చలు సాగిస్తున్నారు. గత ఆరు సంవత్సరాల కాలంలో దేశంలో అత్యధిక ఉద్యోగాల కల్పన జరిగిందని, 1985 నుండి 33 సంవత్సరాల పాటు దేశంలో వచ్చిన ఉద్యోగాల కంటే 2017-18, 2023-24 మధ్య కాలంలో వచ్చిన ఉద్యోగాలే ఎక్కువ అని కేంద్ర బ్యాంక్ చెబుతోంది. ఈ లెక్కన దేశంలో కార్మికుల సంఖ్య 5.2 శాతానికి పెరిగింది. గత పది సంవత్సరాల సగటు 0.34 శాతాన్ని ఇది అధిగమించింది. పని చేయగల వయసున్న వారి జనాభా 1.1శాతం పెరిగింది. ఓ రకంగా ఇది ఉపాధి విస్ఫోటనం వంటదని, అపూర్వమని ఆర్‌బీఐ చెప్పుకుంది. ఉద్యోగాలు పెరిగాయని ఆర్‌బీఐ చెబుతున్నదే నిజమైతే కార్మిక మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉండి ఉండాలి. వేతనాలు, కుటుంబ ఆదాయాలు ఆకాశాన్ని తాకి ఉండాలి. ఖర్చులు, పొదుపు గణనీయంగా పెరిగి ఉండాలి. కానీ అలా జరిగిందా అంటే లేదనే చెప్పాలి.

ఇటీవలి సంవత్సరాలలో వాస్తవ వినియోగ వ్యయం కేవలం 3.5-4 శాతం మాత్రమే పెరిగింది. కుటుంబ పొదుపు రేటు 12 సంవత్సరాల కనిష్ట స్థాయికి... అంటే జీడీపీలో 18.4 శాతానికి పడిపోయింది. ఇక ఉద్యోగ కల్పన విస్ఫోటనం గురించి నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అసలు ఆర్‌బీఐ సమాచారం అతిగా, అసాధారణంగా కన్పిస్తోంది. 2017-18 నుండి ఉద్యోగ కల్పన అద్భుతంగా జరిగిందని ఆర్‌బీఐ చెప్పింది. 2012-13, 2017-18 మధ్యకాలంలో వాస్తవ స్థూల విలువ ఆధారిత వృద్ధి 7 శాతం నుండి 4.2 శాతానికి క్షీణించింది. పైగా ఆర్‌బీఐ చూపుతున్న గణాంకాలు 2011 జనాభా లెక్కల ఆధారంగా తయారు చేసినవి. వాటికి ఏనాడో కాలం చెల్లిపోయింది. కాబట్టి వాటి ఆధారంగా రూపొందించిన అంచనాలు వాస్తవ దూరంగా ఉంటాయి. 2023-24లో 64.3 కోట్ల మంది ఉపాధి పొందారని ఆర్‌బీఐ తెలిపింది. దీనిని బట్టి చూస్తే కార్మికుడు-జనాభా నిష్పత్తి (డబ్ల్యూపీఆర్) 46.2 శాతం ఉండాలి. అయితే ఇది 2017-18లో 36.1 శాతంగా ఉంది. వాస్తవానికి 2004-05లో 42 శాతం ఉన్న డబ్ల్యూపీఆర్ ఆ తర్వాత తగ్గుతూ వచ్చింది. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం ఇప్పుడు బాగా పెరిగింది. 2011-12 నుండి ప్రయివేటు పెట్టుబడులు తగ్గుతూ ఉన్నందున ఉపాధి కల్పన కూడా 20017-18 వరకూ నిలకడగా తగ్గుతూ వచ్చింది.

జమ్మూకాశ్మీర్‌కు అదనపు బలగాలు

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో ఇటీవల వరుస ఉగ్రదాడుల నేపథ్యంలో ఆ ప్రాంతంలో కేంద్రం అదనపు బలగాలను మోహరించనుంది. ఇందుకోసం రెండువేల మందికిపైగా సిబ్బందితో కూడిన రెండు బీఎస్‌ఎఫ్ బెటాలియన్లను అక్కడికి తరలిస్తోంది. జమ్మూకాశ్మీర్‌లో ఇటీవలి కాలంలో వరుస ఉగ్రదాడులు కలవరపెడుతున్నాయి. ఈ దాడుల్లో సైనికులు, సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా జమ్మూ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించనుంది. ఇందుకోసం దాదాపు రెండువేల మందికిపైగా సిబ్బందితో కూడిన రెండు బీఎస్‌ఎఫ్ బెటాలియన్లను జమ్మూ ప్రాంతానికి తరలిస్తోంది. ప్రస్తుతం ఒడిషాలో ఉన్న బీఎస్‌ఎఫ్ సిబ్బందిని తక్షణమే జమ్మూకు తరలించాలని నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జమ్మూ ప్రాంతంలోని రాజౌరీ, పూంచ్, రియాసి, కఠువా, ఉధంపుర్, దోడా జిల్లాలు ఇటీవలి కాలంలో ఉగ్రవాదులకు లక్ష్యంగా మారుతున్నాయి. ఈ ఏడాదిలో 11 మంది భద్రత సిబ్బంది సహా 22 మంది ప్రాణాలు కోల్పోయారు.

గాజా పాఠశాలపై ఇజ్రాయిల్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఇదే విధమైన ప్రకటనలు చేస్తున్నారు. కాల్పుల విరమణకు అంగీకరించడమంటే హమాస్‌కు తలొగ్గడమేనని ఇజ్రాయిల్ జాతీయ భద్రతా మంత్రి బెన్ గావిట్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. ఇదిలా వుండగా ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఫాసిస్టు హిట్లర్‌తో పోల్చుతూ ఐరాస మానవ హక్కుల సంస్థ మాజీ అధికారి ఫ్రాన్సిస్కా అల్బనీస్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు సంచలనం రేపింది. గాజాలో ఊచకోతను నివారించడంలో ఐరాస విఫలమైందంటూ గత ఏడాది అక్టోబరులో అల్బనీస్ తన పదవికి రాజీనామా చేశారు.

కేంద్రం నుంచే నిధులు రాబట్టుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కు పరిశ్రమలపై బిజెపి వైఖరి సరిగాలేదని తెలిపారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చారని, అయితే, నిధులపై స్పష్టత లేదన్నారు. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అంటే, జిల్లాకు రూ.10 వేల కోట్లు రావాలని తెలిపారు. జిల్లాలకు గతంలో ప్రకటించిన రూ.50 కోట్లు చాలా తక్కువని, మూడేళ్ల నుంచి అవి కూడా లేవని అన్నారు. రాష్ట్రంలో పోర్టులు, సహజ వనరులను అదానీకి అప్పగించారని, వాటిని తిరిగి రాబట్టు కోవాలని, అదానీ వంటి వారిపై భారీగా పన్నులు వేయాలని సూచించారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై రూ.17 వేల కోట్లు భారం వేయడానికి విద్యుత్ శాఖ అప్పీల్ చేసిందన్నారు. దీనిని రద్దు చేయాలని కోరారు. శ్వేతపత్రంలో ఈ విషయంపై స్పష్టత లేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అరాచకంగా ఉన్నాయని విమర్శించారు. ప్రజా ఉద్యమాలపై అణచివేతలు కొనసాగుతున్నాయన్నారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై విచారణ చేపట్టాలని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రజాఉద్యమాలపై అణచివేతలు లేకుండా చూడాలని కోరారు. ఇసుక, మద్యం మాఫియాను వదిలేసి ప్రజల కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న పార్టీలు, నేతలపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ఉద్యమకారులపై గత ఐదేళ్లలో పెట్టిన కేసులు ఎత్తేయాలని కోరారు. రాజధాని అమరావతి, పోలవరం, వెనుకబడిన జిల్లాలకు ఐదేళ్లలో ఎంతమేరకు చేయగలమనే దానిపై ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వెనుకబడిన జిల్లాలపైనా శ్వేతపత్రాలు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.





మీకోసం


బేకింగ్ సోడాలో ఒక చెంచా సర్ఫ్, కాసిన్ని నీళ్లు పోసి చేసుకున్న ద్రావణంతో షర్ట్ కాలర్లు ఉతికితే మరకలు త్వరగా పోతాయి.

జీవన సౌరభం

ఫలితాన్ని ఆశించి పరుగెత్తవద్దు.. పనిచేస్తూ పోతే ఫలితం అదే వస్తుంది.

JEEVANA జీవన the family

పిల్లల బాధ్యత



శరభయ్యను వ్యక్తి యుండె
చెట్టు అంటె గిట్టకుండె
ఇది పొయ్యిలోకి అనుచును
గొడ్డలిచే కొట్టుచుండె

రామయ్యను పెద్ద చూచె
శరభయ్యనునడ్డగించె
గొడ్డలిని తను గుంజుకొని
కోపమునూ ప్రదర్శించె

చెట్టు ఇచ్చు చలువ నీడ
పేదవారికదియు మేడ
చెట్లు లేకుంటే ఇంక
కష్టమే నరులకు చూడ

ఆకుపూలు కాయ పండ్లు
ఉంటె దూరమె కడగండ్లు
చెట్లు చుట్టు ఉన్న యెడల
కళకళలాడునూ ఇండ్లు

కాలుష్యం అంతరించు
పచ్చదనం కానిపించు
వేసవి కాలము కూడా
ఎందరొ యిట విశ్రమించు

దానిని వెల కట్టవద్దు
చేజేతుల కొట్టవద్దు
వర్షాభావం అందుకె
ఎవ్వరినీ తిట్టవద్దు

పిల్లలార నాటరండి
మొక్కలు మన పిల్లలండి
వాటి ఆలన పాలనను
మీరే ఇకను చూడండి

అని పలికిన పెద్ద తోడ
శరభయ్యయు జతను గూడ
పిల్లలంత నేల నంత
గునపముతో తవ్వె జూడ

నాటు నాటు మొక్క నాటు
నాటకున్న మనకు చేటు
పిల్లలు మొక్కలను నాట
లేదు మనకు ఆటుపోటు

మొక్కలనూ పంచుకొనిరి
బిడ్డలవలె పెంచుకొనిరి
నీళ్లు పోసి కంచె వేసి
జాగ్రత్తగా చూసుకొనిరి

మొక్కలు పెరిగి చెట్లయ్యె
ఊరు రూపమె వేరయ్యె
చూపరులకు అది అంతా
నందనమై కాననయ్యె!

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య, ధర్మపురి, 99085 54535.

పక్షులు, జంతువులు


పిల్లలూ, ఇక్కడ కొన్ని అక్షరాలు ఇచ్చాం. వాటికి 'దీర్ఘం' పెట్టి, ఆ అక్షరంతో మొదలయ్యే పక్షులు, జంతువుల పేర్లు రాయండి చూద్దాం. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

క	కా కి
వ	-- రం
గ	-- ద
స	-- డు
త	-- లు
బ	- తు
ప	--- ము

నేను గీసిన బొమ్మ



ఎన్.ఝాన్సీ, 5వ తరగతి, దిగువ సాంబయ్య పాలెం, తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'అంతిమ్' ఆగిపోలేదు ...



ఇక ఆడపిల్లలు పుట్టరని, ఈ బిడ్డతో ఆఖరని అర్థం వచ్చేలా తల్లిదండ్రులు ఆమెకి 'అంతిమ్ పంఘల్' అని పేరు పెట్టారు. అమ్మానాన్న వద్దనుకున్న ఆ బిడ్డే ఇప్పుడు తను ఆగిపోలేదని నిరూపిస్తూ విశ్వవేదికపై తన సత్తా చాటుతోంది. ఎన్నో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నా, పారిస్ ఒలింపిక్స్‌లో తొలిసారి అడుగుపెట్టింది. పేరు మోసిన గొప్ప గొప్ప మల్లయోధులతో తలపడుతోంది. పెద్ద పెద్ద కలలు కనే ఎందరో ఆడపిల్లలకు స్ఫూర్తిదాయకమైన 20 ఏళ్ల అంకిత్ పంఘల్ ప్రయాణం గురించి ఇంకాస్త తెలుసుకుందాం.



హర్యానా, హిసార్ జిల్లా భంగనా గ్రామంలో 2004లో అంతిమ్ పుట్టింది. అప్పటికే ముగ్గురు ఆడపిల్లలున్న ఆ కుటుంబంలో అంతిమ్ రాక అంత ఆనందాన్ని ఇవ్వలేదు. మగ పిల్లవాడు కోసం ఎదురుచూసిన వారికి ఈ అక్కర్లేని బిడ్డతో ఇక ఆ కుటుంబంలో ఆడపిల్లలు పుట్టకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే 'ఇదే ఆఖరు' అని అర్థం వచ్చేలా, ఆ పేరు పెట్టారు. 'అంతిమ్' పేరు వెనుక ఇంత విషాదం ఉంది. అయినా తను నిరాశ పడలేదు. పెద్దక్క సరిత కబడ్డీ కోచ్‌గా రాణిస్తున్న సమయంలో తను కూడా ఆటల్లో గెలవాలని తపించింది. తను అక్కర్లేని బిడ్డని కాదని, సామర్థ్యంగల దానినని కుటుంబానికి చెప్పాలని తహతహలాడింది. ఆటలపై మక్కువ చూపుతున్న కూతురు ఇష్టాన్ని తండ్రి నిరుత్సాహపర్చలేదు. అతను ఇచ్చిన ప్రోత్సాహంతో 'చౌదరి చరణ్ సింగ్ హర్యానా అగ్రికల్చరల్ యూనివర్సిటీ'లో కుస్తీ పోటీల్లో శిక్షణ తీసుకుంది. రాత్రింబవళ్లు శక్తివంచన లేకుండా కష్టపడింది. ఆమె కష్టానికి ప్రతిఫలంగా అండర్–20 కేటగిరీలో మొదటిసారి పోటీలకు సిద్ధమైంది. 2023లో ఏషియన్ వ్రెస్ట్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ వేదికపై తన శక్తిసామర్థ్యాలను చూపించింది. ఆమె చూపిన విశేష ప్రతిభకి గాను భారత ప్రభుత్వం 2023లో అర్జున అవార్డుతో ఆమెని సత్కరించింది కూడా. వరుసగా 2022, 2023 ప్రపంచ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న ఘనత కూడా అంతిమ్ ఖాతాలో ఉంది. ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన అంతిమ్ పారిస్ ఒలంపిక్స్‌లో పతకం సాధిస్తానని గొప్ప పట్టుదలతో ఉంది.

'ఈ ప్రయాణంలో నా కుటుంబం ఎంతో సహకరించింది. అక్కలు ముగ్గురు నా బాగోగులు చూసుకున్నారు. పౌష్టికాహారం, శిక్షణా సమయాన్ని వారే దగ్గరుండి పర్యవేక్షించేవారు. సరిత అక్క అయితే నాకు గొప్ప ప్రోత్సాహం ఇచ్చేది' అని అంతిమ్ తన అక్కలు సరిత, నిషా, మీను గురించి గొప్పగా చెప్పింది.

సవాళ్లు ఎదురైనా..

అంతిమ్ క్రీడా జీవితంలో ఎన్నో సవాళ్లు కూడా ఎదురయ్యాయి. ఫామ్‌లో ఉన్న అంతిమ్‌ని 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌కి సెలక్టర్లు ఎంపిక చేయలేదు. ప్రాక్టీస్‌లో లేని వినేష్ ఫోగట్‌ని ఆ పోటీలకు పంపించారు. ఈ విషయంపైన అంతిమ్ తిరుగులేని పోరాటం చేసింది. 'వాస్తవానికి నేను వినేష్ ఫోగట్ సిస్టర్స్‌ని చూసే వ్రెస్ట్లింగ్ నేర్చుకోవాలని పట్టుబట్టాను. వారిద్దరూ నాలో గొప్ప స్ఫూర్తిని నింపిన గొప్ప వ్యక్తులు. కానీ ఆటకి వచ్చేసరికి అన్యాయాన్ని ప్రశ్నించకుండా ఉండలేను. అందుకే ఆ సందర్భంలో ఎదురుతిరిగాను. అలా చేసినందుకు వినేష్ నాపై ద్వేషం పెంచుకోలేదు. నా ధైర్యసాహసాలను మెచ్చుకుంది. అప్పుడు ఆమెపై నా అభిమానం మరింత పెరిగింది. ఈ ఒలింపిక్స్‌లో నేను పాల్గొనడానికి ఒక కారణం వినేష్ ఫోగట్' అని తన అభిమాన క్రీడాకారిణిపై ప్రశంసలు కురిపించింది అంతిమ్.

'లింగ వ్యతిరేకతపై హర్యానా సంస్కృతిలో ఎన్నో ఏళ్లుగా వేళ్లూనుకొన్న ధోరణిలో గణనీయమైన మార్పు వస్తోంది. ఇప్పుడు అక్కడ ఆడపిల్లలు అక్కర్లేని పిల్లలు కాదు.. ఆరాధ్యధీరలు. ఒక్కో కుటుంబం తమ ఇంటి ఆడపిల్లని అమితంగా ప్రేమిస్తోంది. తన హక్కులను కాపాడుతోంది. సమాజంలో ఇంత మార్పు రావడానికి మా ఆడపిల్లలే కారణం. వినేష్, అంతిమ్ లాంటి క్రీడాకారిణులు సాధించిన విజయాలను ఆ కుటుంబాలు పండగ చేసుకుంటున్నాయి' అంటున్నారు అంతిమ్ తండ్రి రామ్‌నివాస్.

అంతిమ్ ప్రస్తుతం జపనీస్ ఆటగాడు అకారీ పుజినామితో సహ ప్రముఖ క్రీడాకారులతో తలపడనుంది. 'ఓటముల నుండి పాఠాలు నేర్చుకోవడం అంతిమ్‌కి తెలుసు. తనెప్పుడూ కుంగిపోలేదు. సామర్థ్యాన్ని పెంచుకుని రెట్టింపు ఉత్సాహంతో బరిలో నిలబడుతుంది' అని తన కోచ్ భగత్‌సింగ్ అంతిమ్ ధైర్యసాహసాల గురించి చెబుతున్నారు. 'అంతిమ్' ఆగిపోలేదు.. ఇప్పుడే ఆరంభించింది.


అంతిమ్ కుటుంబం

చిన్న చిట్కా..



చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను మన ఇంట్లో ఉండే ఆహార పదార్థాలతోనే దూరం చేసుకోవచ్చు. ఏయే పదార్థాలతో ఏయే లాభాలు ఉన్నాయో చూద్దాం.


- నోటి దుర్వాసన, చిగుళ్ల సమస్యలు చాలామందికి ఎదురవుతూ ఉంటాయి. ఎన్నిరకాల పేస్టులు వాడినా సమస్య పరిష్కారం కాదు. ప్రతి రోజూ నాలుగైదు పుదీనా ఆకులను తినడం వల్ల ఈ ఇబ్బంది నుంచి బయటపడొచ్చు.
- రెండుమూడు రకాల మందులు వేసుకున్నా.. పడిశం ఓ పట్టాన లొంగదు. ఇలాంటప్పుడు మిరియాల చారు భేషుగ్గా పనిచేస్తుంది. పాలలో మిరియాల పొడి వేసుకొని తాగినా గుణం కనిపిస్తుంది. అంతేకాదు ఆహారంలో మిరియాల పొడి తీసుకోవడం అలవాటు చేసుకుంటే.. రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గుతుంది. నాళాల్లో రక్తం గడ్డకట్టే సమస్య కూడా దూరమవుతుంది.
- రక్తపోటు సమస్యకు సరైన వైద్యం తీసుకోవాలి. బీపీ నియంత్రణలో ఉండాలంటే మునగాకు పొడి తరచూ తీసుకోవడం మంచిది. ప్రతిరోజూ చిటికెడు మునగాకు పొడి తీసుకుంటే.. బీపీ కంట్రోల్‌లో ఉంటుంది.
- రక్తహీనత సమస్యకు తేనె చక్కని పరిష్కారం. చక్కెర వినియోగాన్ని తగ్గించి టీ, కాఫీ, ఇతర ఆహార పదార్థాల్లో తేనెను ఉపయోగిస్తే రక్తహీనత నుంచి బయటపడొచ్చు.
- రక్తనాళాలు మందంగా ఉండి సమస్యలను ఎదుర్కొనే వాళ్లు బీట్‌రూట్ రసాన్ని రోజూ తాగితే మంచిది. అప్పుడు రక్త ప్రసరణ మెరుగవుతుంది. గుండె సమస్యలు కూడా దరిచేరవు.



పారిస్‌లో చిరంజీవి

పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్‌లో చిరంజీవి సందడి చేశారు. ఆరంభోత్సవ వేడుకలో పాల్గొన్న ఓ ఇంట్రెస్టింగ్ పిక్‌ని ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'ఒలింపిక్స్ ఆరంభోత్సవానికి హాజరు కావడం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉందని అలాగే ఒలింపిక్ టార్చ్‌ని నా భార్య సురేఖతో కలిసి పట్టుకోవడం ఒక మధురానుభూతిగా మిగిలిపోయింది' అని తెలిపారు. అలాగే 'ఇండియా నుంచి వెళ్లిన ప్రతి క్రీడాకారునికి తన బెస్ట్ విషెస్ తెలియజేస్తున్నాను' అని వారికి ఉత్సాహాన్నిస్తూ 'జై హింద్' అంటూ పోస్ట్ చేశారు. ఈ ఫొటోలో కౌ బాయ్ హ్యాట్‌లో చిరంజీవి కనిపిస్తున్నారు.

అల్లరి నరేష్ సినిమా ప్రారంభం



అల్లరి నరేష్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్నారు. ఈ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.29గా రూపొందనున్న ఈ సినిమాని అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా జూన్ 30న ప్రకటించారు. తాజాగా శనివారం పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించారు. 'ఫ్యామిలీ డ్రామా' చిత్రంతో ప్రశంసలు అందుకున్న రచయిత, దర్శకుడు మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వారం రోజుల్లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. నూతన కాన్సెప్ట్ తో రూపొందుతోన్న ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించి, ఘన విజయం సాధిస్తుందని ఈ సందర్భంగా నిర్మాతలు ఆశాభావం వ్యక్తం చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకట్ ఉప్పుటూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నారు. జిబ్రాన్ సంగీతం అందించనున్నారు. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

అక్టోబర్ 4న జపాన్‌లో 'హను-మాన్' విడుదల



తేజ సజ్జ నటించిన సినిమా 'హను–మాన్' జపాన్‌లో అక్టోబర్ 4న విడుదల కానుంది. ప్రశాంత్ వర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సంక్రాంతి బరిలో పెద్ద హీరోల సినిమాలను వెనక్కి నెట్టి ఈ సినిమా హిట్ కొట్టిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 4న ఈ సినిమాను జపాన్‌లో విడుదల చేస్తున్నామని దర్శకుడు ప్రశాంత్ వర్మ తన ఎక్స్ ఖాతా ద్వారా తెలిపారు. జపనీస్ సబ్ టైటిల్ వెర్షన్ అదే రోజు విడుదల కానుందని ఆయన పేర్కొన్నారు.

రసవత్తరంగా తెలుగు ఫిలిం ఛాంబర్ ఎన్నికలు

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ బైలా ప్రకారం ప్రస్తుత అధ్యక్షులు దిల్‌రాజు పదవి కాలం ముగిసింది. ఆ పదవికి ఈసారి డిస్ట్రిబ్యూటర్ విభాగం నుంచి అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సివుంది. ఈ నేపథ్యంలో ఈ పదవికి గట్టి పోటీ నెలకొంది. డిస్ట్రిబ్యూటర్ సెక్టార్ నుంచి ఠాగూర్ మధు (నెల్లూరు), భరత్‌భూషణ్ (విశాఖపట్టణం) బరిలో నిలిచారు. బైలా ప్రకారం ఒక ఉపాధ్యక్ష పదవిని నిర్మాతల నుంచి ఎన్నుకోవాల్సివుంది. ఈ పదవిని కూడా గట్టి పోటీ నెలకొంది. నిర్మాతల విభాగం నుంచి కె.అశోక్‌కుమార్, నిర్మాత, దర్శకుడు వై.వి.ఎస్.చౌదరి పోటీ పడుతున్నారు. ఈ సారి ఈ ఎన్నిక రసవత్తరంగా ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

'ఉషా పరిణయం' అందరికీ నచ్చుతుంది



కె. విజయ్‌భాస్కర్ దర్శకత్వంలో తాజాగా లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రాబోతుంది. 'ఉషా పరిణయం' పేరుతో తెరకెక్కిన ఈ చిత్రానికి 'లవ్ ఈజ్ బ్యూటీఫుల్' అనేది ఉపశీర్షిక. కె. విజయ్‌భాస్కర్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం ఆగస్ట్ 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ చిత్రవిశేషాలను ముచ్చటించారు. 'ఈ మధ్య ప్రేమకు అర్థం మారిపోయింది. ప్రేమ పేరుతో అమ్మాయిలపై దాడులు జరగడం ఎక్కువైపోయింది. నిజం చెప్పాలంటే అసలు అది ప్రేమకాదు. లవ్ అనేది ఎప్పుడూ హింసాత్మకంగా వుండదు. హింసాత్మకంగా వుంటే అది ప్రేమే కాదు. అలా నా స్టయిల్‌లో చెప్పాలనుకున్నాను. ఈ పాయింట్ ఈ సినిమాలో చెబుతున్నాను. ఈ సినిమాతో తాన్వీ ఆకాంక్ష అనే తెలుగమ్మాయిని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నాం. ఈ సినిమా కథ ఓ కుర్రాడి కోసం తయారు చేసిన కథ. కేవలం నా కొడుకు కోసం చేసిన కథ కాదు. వాడి వయసుకు తగ్గ కథ ఇది. 100 ఏళ్ల అయిన ప్రేక్షకుల అభిరుచి మారదు. చక్కగా ఎంటర్‌టైన్ చేయగలిగితే.. ఆడియన్స్ చూస్తారు. చాలా రోజుల తరువాత నాకు మనస్ఫూర్తిగా మంచి పాటలు ఆడియన్స్‌కు ఇచ్చామనే ఫీలింగ్ కలిగింది. ఆర్.ఆర్ ధ్రువన్ నా కథకు తగ్గట్టుగా చాలా మంచి సంగీతం ఇచ్చాడు. ఇంతకు ముందు లవ్, ఎమోషన్ ఎంతో సున్నితంగా వుండేవి. ఇప్పుడు ఆ సున్నితత్వం పోయింది. ప్రేమ అనేది ఎంతో నోబుల్ ఎమోషన్. నేటి కథల్లో అది మిస్ అవుతుంది. ఇంటెన్సిటి ఎమోషన్. ఆ అమ్మాయి భావాలను శాసించే హక్కు ఎవరికీ వుండదు. ఇలాంటివన్నీ ఈ సినిమాలో ఎంటర్‌టైనింగ్‌గా చెబుతున్నాను'. అని వివరించారు.



'అలనాటి రామచంద్రుడు' ఫస్ట్ లుక్ విడుదల

కృష్ణవంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాష్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైనివా క్రియేషన్స్‌పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను మేకర్లు విడుదల చేశారు. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిలుకూరి ఆకాశ్‌రెడ్డి మాట్లాడుతూ హైమావతి, శ్రీరామ్ జడపోలు మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్ తీసి అవార్డులు అందుకున్న ఆకాష్‌రెడ్డి తొలిసారిగా దర్శకుడిగా ఈ సినిమా తీశారన్నారు. మా సినిమా చిరు జల్లుల్లా హాయిగా ఉంటుంది. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉందని చిలుకూరి ఆకాష్‌రెడ్డి అన్నారు. ఈ చిత్రానికి అసోసియేట్ నిర్మాత విక్రమ్ జమ్ముల, కెమెరా ప్రేమ్‌సాగర్, సంగీతం శశాంక్ తిరుపతి, లైన్ ప్రొడ్యూసర్ అవినాష్ సామల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గద్దల అన్వేష్.

షూటింగ్ ఫైనల్‌కు మను




పారిస్ : పారిస్ ఒలింపిక్స్‌లో తొలిరోజు భారత యువ షూటర్ మనిక బత్రా అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. శనివారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ పిస్టల్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో మను బాకర్ మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లోనూ సత్తా చాటితే పతకం ఖాయం కానుంది. పురుషుల క్వాలిఫికేషన్ రౌండ్‌లో సరబ్‌జోత్ సింగ్, అర్జున్ చీమా ఫైనల్‌కు ఆర్హత సాధించలేక పోయారు. అలాగే ఒక్కపాయింట్ తేడాతో సరబ్‌జోత్ సింగ్ ఫైనల్లో చోటు కోల్పోయాడు. సరబ్‌జోత్ ఒక దశలో టాప్ 3లోకి దూసుకెళ్లినప్పటికీ చివరకు అనూహ్యంగా 9వ స్థానానికి పడిపోయాడు. 577.16 పాయింట్లతో సరబ్‌జోత్ సింగ్ 9వ స్థానంలో నిలవగా.. 577.17 పాయింట్లతో జర్మనీ షూటర్ వాల్టర్ 8వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. టాప్–8లో నిలిచిన షూటర్ల మధ్య ఫైనల్, పతకం పోరు జరగనుంది. భారత మరో షూటర్ అర్జున్ సింగ్ చీమా 574 పాయింట్లతో 18 స్థానంతో సరిపెట్టుకున్నాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ మెడల్ ఈవెంట్‌లో అర్జున్ బబూటా–రమితా జిందాల్, సందీప్ సింగ్–ఇలవేనిల్ వలరివన్ జోడి మెడల్స్ పోరుకు అర్హత సాధించలేకపోయాయి. రమిత–అర్జున్ బబుతా జోడీ 628.7 స్కోర్‌తో ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. మరో జోడీ వలరివన్–సందీప్ సింగ్ 626.3 పాయింట్లతో 12 స్థానానికి పరిమితమైంది. టాప్–4లో ఉన్న వారు ఫైనల్ పోరుకు అర్హత సాధిస్తారు. మనిక బాత్రా పాల్గొనే మహిళల 10మీ, ఎయిర్ పిస్టల్ ఫైనల్స్ జులై 28న మధ్యాహ్నం 3.30 గంటలకు జరగనుంది.

ఒలింపిక్స్‌లో నేడు (భారత్ పోటీపడే క్రీడాంశాలివే..)

మ.12.00గం॥	**బ్యాడ్మింటన్(గ్రూప్‌స్టేజ్)** హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, పివి సింధు, సాత్విక్–చిరాగ్, తానీషా–పొన్నప్ప
మ.12.45గం॥	**షూటింగ్ :** మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ ఇలవేణి వలరివాన్, రమిత జిందాల్
మ.1.00గం॥	**ఆర్చరీ :** మహిళల టీమ్ (రౌండ్–16) దీపిక, అంకిత, భజన్
మ.1.06గం॥	**రోయింగ్ :** పురుషుల సింగిల్స్ స్కల్స్: బల్‌రాజ్ పన్వార్.
మ.1.30గం॥	**టేబుల్ టెన్నిస్ :** పురుషుల, మహిళలసింగిల్స్ శరత్ కమల్, హర్‌మీత్ దేశాయ్, మనిక, శ్రీజ
మ.2.30గం॥	**బాక్సింగ్ :** పురుషుల 51కి.(రౌండ్–32)అమిత్ పంగల్
మ.2.30గం॥	**స్విమ్మింగ్ :** హీట్; శ్రీహరి నటరాజన్, ధీనిధి దేసింఘు(మహిళల ఫ్రీస్టైల్)
మ.2.45గం॥	**షూటింగ్ :** పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్: సందీప్, అర్జున్
మ.3.02గం॥	**బాక్సింగ్ :** పురుషుల 71కి. రౌండ్–32: నిషాంత్ దేవ్
మ.3.30గం॥	**టెన్నిస్ :** పురుషుల సింగిల్స్, డబుల్స్... సుమిత్ నాగల్, రోహన్ బొప్పన్న–శ్రీరాం బాలాజీ
సా.4.06గం॥	**బాక్సింగ్ :** రౌండ్–32 మహిళల 50కి.: నిఖత్ జరీన్
సా.5.45గం॥	**ఆర్చరీ :** మహిళల టీం క్వాలిఫికేషన్: దీపిక, అంకిత, భజన్

- **బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్, చిరాగ్–సాత్విక్ శుభారంభం**
- **హాకీలో న్యూజిలాండ్‌పై గెలుపు**



రోయింగ్ పురుషుల సింగిల్ స్కల్స్ హీట్స్‌లో బాల్‌రాజ్ పన్వర్ నాలుగో స్థానంలో నిలిచాడు. హీట్ 1లో పోటీ చేసిన అతడు 7:07.11 నిమిషాల్లో అతడు రేసును పూర్తి చేసి రెపిచేజెస్ రౌండ్‌కు చేరుకున్నాడు. హాకీలో భారత్ 3–2గోల్స్‌తో న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది.

పతకాల పట్టిక(టాప్-10)

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	2	0	0	2
2. బెల్జియం	1	0	1	2
3. జపాన్	1	0	1	2
4. కజకిస్తాన్	1	0	1	2
5. ఆస్ట్రేలియా	1	0	0	1
6. ఫ్రాన్స్	0	1	1	2
7. బ్రిటన్	0	1	1	2
8. అమెరికా	0	1	1	2
9. ఇటలీ	0	1	0	1
10. ద.కొరియా	0	1	0	1
11. మంగోలియా	0	1	0	1
12. స్పెయిన్	0	0	1	1
13. స్వీడన్	0	0	1	1

సత్తా చాటిన సూర్యకుమార్

తొలి టి20లో శ్రీలంకపై 43పరుగుల తేడాతో గెలుపు



పల్లెకెలె: శ్రీలంక పర్యటనను టీమిండియా ఘనంగా ఆరంభించింది. శ్రీలంకతో శనివారం జరిగిన టి20లో భారత్ 43పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 213పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో శ్రీలంక 19.2ఓవర్లలో 170పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు నిస్సంక(79), కుశాల్ మెండీస్(45) తొలి వికెట్‌కు 84పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత శ్రీలంక 2వ వికెట్‌ను 140 వద్ద కోల్పోయింది. రెండో వికెట్ కోల్పోయాక భారత బౌలర్లు వరుసగా వికెట్లను పడగొట్టి మ్యాచ్‌ను మలుపుతిప్పారు. రియాన్ పరాగ్‌కు మూడు, అర్ష్‌దీప్, అక్షర్‌కు రెండేసి, సిరాజ్, బిష్ణోయ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సూర్యకుమార్ యాదవ్‌కు లభించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు యువ ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(40), శుభ్‌మన్ గిల్(34)లు అదిరే అరంభమిచ్చారు. దీంతో టీమిండియా 5ఓవర్లకే స్కోర్ 50 దాటింది. తొలి వికెట్‌కు 74 పరుగుల వద్ద కోల్పోగా.. రెండో వికెట్ 74 వద్ద కోల్పోయింది. వికెట్ కీపర్ రిషభ్ పంత్(49) చక్కని సహకారం అందించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(58; 26బంతుల్లో 8ఫోర్లు, 2 సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించాడు. శ్రీలంక బౌలర్లు పథీరనకు నాలుగు, ఫెర్నాండో, మధుశంక, హసరంగకు ఒక్కో వికెట్ దక్కాయి.



టైటిల్ కొట్టేదెవరో..?

నేడు మహిళల ఆసియాకప్ ఫైనల్ రాత్రి 7.00గం॥లకు

ఆసియాకప్ మహిళల క్రికెట్ ఫైనల్‌కు దంబుల్లా వేదికగా ఆదివారం జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో హర్మన్‌ప్రీత్ సేన అప్రతిహాత విజయాలతో ఫైనల్లోకి దూసుకొచ్చింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఆతిథ్య శ్రీలంకతో టైటిల్‌కై తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ ఈ టైటిల్‌ను అత్యధికంగా ఏడుసార్లు చేజిక్కించుకొంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68